Dr. B.R. Ambedkar Memorial Lecture 2023



ఓబీసీలకు అంబేద్కర్ కాంట్రిబ్యూషన్

బి.ఎస్. రాములు

తెలంగాణ రాష్ట్ర బి.సి. కమిషన్ మాజీ చైర్మన్

Organised by

Dr.B.R. Ambedkar Open University,

Prof.G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033

About Dr. BRAOU

The University, initially known as Andhra Pradesh Open University, was set up on 26th August 1982 through an Act of the A.P.State Legislature (APOU Act 1982). Subsequently the University was renamed as Dr.B.R.Ambedkar Open University on 26th October,1991. The establishment of this University, the first of its kind in India, heralded and era of affirmative action on the part of the Government of Andhra Pradesh to provide opportunities of higher education to all sections of society to meet the changing individual and social needs. The University is providing services to the student community through a wide network of 179 study centres spread across both Telangana & Andhra Pradesh States, including 23 Regional Co-ordination centres and 11centres exclusively meant for women students. Prison inmates under life sentence also enrol themselves as students and pursue education through exclusive study centres at Central Prison - Cherlapally, Warangal, Rajahmundry, Visakhapatnam, Kadapa and Nellore and exclusive Study Centre for Army Personal and their family members, which was located at AOC, Secunderabad. The University offers Certificates, UG, PG Diploma and PG Degree and Research Programmes in including various Professional Programmes.

ఓబీసీలకు అంబేద్కర్ కాంట్రిబ్యూషన్

- బి ఎస్ రాములు
బీసీ కమిషన్ మాజీ చైర్మన్
8331966987

డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 15న "ఓబీసీలకు డా॥ బి.ఆర్. అంబేడ్కర్ కాంట్రిబ్యూషన్" అనే అంశంపై డా॥ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ హైదరాబాద్‌లో ప్రసంగించాలని కోరడం నా బాధ్యతను పెంచింది. అతి తక్కువ సమయం ఇచ్చారు. 74 యేళ్ళ వయస్సులో మొత్తం చరిత్రను, అంబేద్కర్ రచనలను, ఇతర గ్రంథాలను పునరధ్యయనం చేయడం చాలా కష్టమైన పని. వీలైనంత మేరకు మళ్లీ పుస్తకాలు అధ్యయనం చేస్తూ, పలు రాష్ట్రాల బీసీ కమిషన్‌ల నివేధికల ఆధారంతో, జ్ఞాపకాలతో, పలువురితో జరిపిన సంభాషణలతో ఇలా రూపొందించడం జరిగింది.

1

1. భారతదేశంలో ప్రధాన సమస్య

భారతదేశంలో కొన్ని శతాబ్దాలుగా వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, కర్మ, ఆత్మ, పునర్జన్మల సిద్ధాంతాలు రాజరిక, భూస్వామ్య సంస్కృతి, సామాజిక జీవనాన్ని నిర్దేశిస్తున్నాయి. శ్రమజీవులను, పనిచేసేవారిని, సంపద సృష్టించేవారిని, కులవృత్తులను, తక్కువచేసి పనిచేయకుండా కూర్చుని తినేవారిని గొప్పవారనే నీచ సంస్కృతి కొనసాగుతూ వస్తున్నది. దానినే హిందూ సంస్కృతి, బ్రాహ్మణీయ సంస్కృతి, వర్ణాధిక్య సంస్కృతి అని పిలుస్తారు.

వర్ణ, కుల వ్యవస్థలు, పితృస్వామిక భావజాలం, రాజరిక, భూస్వామ్య వ్యవస్థల, అసమానతల సంస్కృతి, నిరంతరం శ్రమిస్తూ, మానవ సంపదను, సమాజ సంపదను సృష్టిస్తూ, పెంచి పోషిస్తున్న సమాజానికి మూల స్తంభాలైన స్త్రీలను, శూద్రులను,

అతిశూద్రులను బానిసలుగా, సేవకులుగా, రెండవ శ్రేణి మానవులుగా అణచివేసింది. ఎలాంటి ఆస్థి సంపద కూడబెట్టుకోకూడదని, విద్యను అభ్యసించకూడదని అవమానాలకు, పీడనకు, ఆత్మన్యూనతకు గురిచేసింది.

కులం ఒక ఆర్థిక వ్యవస్థ, ఒక సాంస్కృతిక వ్యవస్థ, ఒక సామాజిక వ్యవస్థ, ఒక విలువల వ్యవస్థ, కులం కొందరికి ఆయాచిత పెట్టుబడిగా కొనసాగుతున్నది. మానవ సంబంధాలను, అవమానాలతో కూడిన అసమానతలను సహజం అనుకునేవిధంగా, సామాజిక శాస్త్రాలను, సంస్కృతిని ముందుకు తెచ్చింది.

కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ మనుషుల మధ్య అసమానతలను, ఆర్థిక దోపిడీని, సాసంస్కృతిక దోపిడీని శాశ్వతం చేస్తూ, అణచివేతని సజావుగా సాగడానికి కొందరి ఆధిపత్యాన్ని, సుఖాలను నిరంతరం కొనసాగించ డానికి పునాదులు వేసింది. మనుధర్మం, మనుస్మృతి వంటి గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలు, భగవద్గీత, రామాయణం, మమాభారతం ఈ అసమానతల వివక్షతలు, అణచివేతలను, వెలివేతలను, దోపిడీని స్థిరపరిచే సంస్కృతిని స్థిరపరుస్తూ వస్తున్నది. ఆర్యులు త్రైవర్ణీకులు అని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనే మూడు వర్ణాలకు శూద్రులు సేవ చేయడమే వారి జీవిత పరమార్థం అని సిద్ధాంతీకరించారు. శూద్రులు, అతిశూద్రులు ఈ మూడు వర్ణాలకు జీవితాలను అంకితం చేసి, త్యాగాలు చేసి శతాబ్దాలుగా అణగారిపోయారు. శూద్రులు, అతిశూద్రులు శతాబ్దాలుగా ఈ దేశ సంపద సృష్టికర్తలు. సమస్థ సంపదలు సృష్టికర్తలయిన శూద్రులను, అతిశూద్రులను సామాజిక వ్యవస్థలో అట్టడుగు వర్గాలవారీగా కిందికి తోశారు. ఈ అన్ని అసమానతలను, వివక్షతలను, సంస్కృతిని, ఆర్థిక దోపిడీని, ఆత్మన్యూనతను కలిగించే వర్ణ, కుల వ్యవస్థల సిద్ధాంతాలను, మనుస్మృతిని, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల కర్మకాండను, సంస్కృతిని, ఆధిపత్యాలను వ్యతిరేకిస్తూ నూతన ఆధునిక మానవుని ఆవిర్భావం కోసం డా॥ బి.ఆర్. అంబేద్కర్ తన జీవితమంతా కృషి చేశారు.

"రెవల్యూషన్, కౌంటర్ రెవల్యూషన్" (విప్లవం ప్రతిఘాతక విప్లవం) అనే సిద్ధాంత వ్యాసంలో చరిత్ర పొడవునా సాగిన దుర్మార్గ వ్యవస్థను ఎప్పటికప్పుడు జరిగిన తిరుగుబాట్లను డా॥ బి.ఆర్. అంబేద్కర్ సోదాహరణంగా వివరించారు. కరుడుకట్టిన వర్ణ కుల వ్యవస్థలు, బ్రాహ్మణీయ హిందూ సమాజం ఇతర దేశాలనుండి వలసలు,

ముస్లింల, క్రైస్తవుల ప్రవేశం, దాడులు, దండయాత్రలు, రాజ్యాల ఏర్పాటు జరిగి ఆధిపత్యంలోకి వచ్చినప్పుడే సంస్కరణలు, మార్పులు చేర్పులు జరుగుతూ వచ్చాయి. మహమ్మదీయులు భారతదేశంలో దండయాత్రలతో రాజ్యాలు ఏలినప్పుడు తనను తాను కాపాడుకోవడం కోసం హిందూ సమాజం తనను తాను సంస్కరించు కోవడానికి ప్రయత్నించింది. శూద్రులు, అతిశూద్రులు ఇస్లాంలోని, బౌద్ధంలోని సామాజిక సమానత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని భక్తి ఉద్యమాల రూపంలో విప్లవించారు. హిందూ ముస్లింల సఖ్యత కోసం కృషి చేశారు. బ్రాహ్మణీయ భక్తి ఉద్యమాలు, దేవాలయాలను, నదులను, క్షేత్రాలను పుణ్యస్థలాలుగా పూజించాలని ప్రచారం చేశాయి. దేవాలయాలలో ప్రజలనుంచి, రాజులనుంచి సంపద సేకరించి దాచుకున్నారు. ధర్మం పేరిట సేకరించి దాచుకున్న సంపద సోమనాథ్ దేవాలయంలో, అనంతపద్మనాభ స్వామి దేవాలయంలో వేలకోట్ల సంపద పోగుపడిన విషయం చరిత్ర ప్రసిద్ధం. చరిత్ర పొడవునా దేవాలయాల ద్వారా సంపద దోపిడీ ఎలా సాగిందో వి.జె.ఆర్. నారగోని సోదాహరణంగా వివరించారు.

శూద్ర అతిశూద్ర భక్తి ఉద్యమాలు మనిషిని, మానవత్వాన్ని, సమానత్వాన్ని, మానవీయ సంబంధాలను, విలువలను ప్రచారం చేశాయి. దేవాలయాలు, నదులు, క్షేత్రాలు, వాటి పర్యటనలను వ్యతిరేకిస్తూ, మానవ సేవే, మాధవ సేవ అని, మనిషిని గౌరవించాలని, చేతివృత్తులను, కులవృత్తులను, వ్యవసాయాన్ని గౌరవించాలని, ఆత్మ గౌరవాన్ని, శూద్రులు, అతిశూద్రుల్లో ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తూ భక్తి ఉ ద్యమాల రూపంలో ప్రచారం చేశారు. అందువల్ల ఏకకాలంలో సాగిన భక్తి ఉ ద్యమాలు రెండూ ఒకటి కావు. ఒకటి బ్రాహ్మణీయ భక్తి ఉద్యమాలు. మరొకటి శూద్ర, అతిశూద్రులను సమృద్ధంగా గౌరవించే భక్తి ఉద్యమాలు. అలా కృషి చేసిన కబీర్‌దాస్‌ను, డా॥ బి.ఆర్. అంబేడ్కర్ సామాజిక విప్లవకారుడిగా కీర్తించారు. 1946లో రాసిన 'హూ ఆర్ శూద్రాస్' అనే పుస్తకాన్ని బుద్ధుడు, కబీర్‌దాస్, మహాత్మా జ్యోతిబా ఫూలేలు సామాజిక విప్లవకారులని వారికి అంకితం ఇచ్చాడు.

2. బ్రాహ్మణిజానికి అనేక రూపాలు, అనేక సిద్ధాంతాలు

1916లో ఒక బ్రాహ్మణుడికి చెప్రాసి (అటెండర్/ఫ్యూను) ఉద్యోగం ఇవ్వకుండా శూద్రులకు ఇవ్వడంవల్ల మద్రాసు రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్రా రాష్ట్రం కావాలని

కోస్తాంధ్ర బ్రాహ్మణులు ఆంధ్రా ఉద్యమంలో ఉద్యమంతో ముందుకు వచ్చారు. 1921లో అఖిలభారత కాంగ్రెసు పార్టీ కాకినాడ మహాసభల్లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయడానికి తీర్మానించింది. ఇలా శూద్ర, అతిశూద్ర సమస్య ఉద్యోగాల కల్పన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంగా కోస్తా ఆంధ్రా బ్రాహ్మణులు శూద్రులకు, అతిశూద్రులకు పెద్దపీట వేస్తున్న జస్టిస్ పార్టీకి వ్యతిరేకంగా, పెరియార్ రామస్వామి నాయకర్ ద్రవిడ నాన్ బ్రాహ్మిణ్ ఉద్యమానికి వ్యతిరేకంగా సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొని వచ్చారు.

3. కమ్యూనిజంలో బ్రాహ్మణిజం – జాతుల సమస్య సిద్ధాంతం

ఎం.ఎన్. రాయ్ జాతుల సమస్యపై లెనిన్‌కు చేసిన సూచనలు బ్రాహ్మణిజంలో, అగ్రకులతత్వంలో భాగమే. ఇలా బ్రాహ్మణిజం కమ్యూనిజాన్ని కూడా వదిలిపెట్టలేదు. మార్క్సిజంలోని జాతుల సమస్యలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలవాదాలను, ప్రాంతాలను ప్రయోజనాలను జాతీయవాదంగా గుర్తించ నిరాకరించారు. అది కులతత్వవాదం అన్నారు. అగ్రవర్ణ, అగ్రకుల పెట్టుబడిదారులను, అగ్రకుల మధ్య తరగతిని, స్థానిక బూర్జువాలు అని, జాతీయవాదులు అని, అది జాతీయవాదం అని సిద్ధాంతీకరించారు. అవే ప్రయోజనాలకోసం ముందుకు కదులుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, శూద్ర, అతిశూద్ర కుల ఉద్యమాలను జాతీయ ఉద్యమాలు అని అంగీకరించడానికి వారి మనస్సు ఒప్పలేదు. వారిది కుల వాదం అన్నారు. ఇలా జాతుల సమస్య, జాతుల స్వయం నిర్ణయాధికారం, స్థానిక బూర్జువాల అభివృద్ధికి చేయూత పేరిట, మద్దతు పేరిట, అగ్రవర్ణ, అగ్రకులాల ప్రయోజనాలనే నిరంతరం కాపాడుతూ, పెంచి పోషిస్తూ వస్తున్నారు. ఇది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కూడా కావాలని కోరినప్పుడు వారిని కులతత్వం అని పేర్కొంటున్నారు.

నేటికీ ఈ సిద్ధాంతాన్ని వారు వదులుకోలేకపోతున్నారు. అందువల్లే వారు బీసీ, ఎస్సీ, ఎస్టీల వాదాలను, రాజ్యాధికార సిద్ధాంతాలను, బహుజన జాతీయవాదాన్ని బహుళ ప్రజానీక రాజ్యాధికార సిద్ధాంతాలుగా ఆమోదించడం లేదు. ఆయా సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలని చేస్తున్న ఉద్యమాలను మార్క్సిస్టులు, వామపక్షాలు వ్యతిరేకించడం బ్రాహ్మణిజంలో భాగమే. తామే అధికారంలోకి రావాలి అని ఆయా వామపక్ష పార్టీలు అనుకుంటున్నాయి తప్ప

ఆయా సామాజిక వర్గాలు రాజకీయ ప్రాతినిథ్యం పొందడానికి రాజ్యాంగంలో చేర్చాల్సి ఉంటుందని మాత్రం అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ఇలా వారి తాత్విక భూమికతో 70 శాతం జనాభా గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, సామాజిక వర్గాల రాజకీయ ప్రాతినిథ్య సిద్ధాంతమే లోపించింది. నేటికీ అలాగే కొనసాగుతున్నది. మార్క్సిజంకు సంబంధించిన అన్ని పార్టీలకు ఈ మాట వర్తిస్తుంది. అందుకే డా॥ బి.ఆర్. అంబేడ్కర్ వీరిని బ్రాహ్మణ్ బాయ్స్ అని సంబోదించాడు. కొందరు ఉద్యమిస్తున్న ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా అధికారంలోకి రాకుండా, ఎన్నికలను బహిష్కరించాలని, ఎన్నికలకు దూరంగా ఉండాలని, ప్రజలు అధికారంలో భాగస్వామ్యం కాకుండా, విచిత్రమైన సిద్ధాంతాలు ముందుకు తెచ్చారు.

వామపక్షాలు అనేక కార్మిక ఉద్యమాలను నిర్మించాయి. రైతుకూలి ఉద్యమాలను నిర్మించాయి. దున్నేవారికి భూమి అని నినాదాలు ఇచ్చాయి. ఉద్యోగులకు, పట్టణ కార్మికులకు ఎన్నో పోరాటాలు చేసి మద్దతుగా నిలిచారు. అయితే భూస్వామ్య రాజరిక బ్రాహ్మణీయ సంస్కృతికి వ్యతిరేకంగా వారి ఉద్యమాలను ఎక్కుపెట్టలేదు. పెట్టుబడిదారీ సంస్కృతికి వ్యతిరేకంగా కార్మికవర్గ సంస్కృతి నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి పూనుకోలేదు. ఆధిపత్యవాదాలు, అణచివేతలు, సంస్కృతి, నిర్మాణ రూపాల్లో కొనసాగుతాయి. వామపక్షాలు, కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ వంటి నిర్మాణ రూపాల్లో కొనసాగుతున్న వాటిని, భావజాలాన్ని, సంస్కృతిని పట్టించుకోలేదు. వాటి స్థానంలో నూతన ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, కులాతీత సంస్కృతి నిర్మాణం కోసం కృషి చేయలేదు. ఆర్థిక పోరాటాలకు, ఆకలి పోరాటాలకు పరిమితమయ్యారు. సాంస్కృతిక ఉద్యమాల పేరుతో హిందూ జాతీయత, భారతీయత, హిందూ సంస్కృతి పేరిట, బ్రాహ్మణీయ, అగ్రకుల రాజరిక, భూస్వామ్య కాలాలనాటి సంస్కృతిని, జీవన విధానాన్ని ఆస్థిక భావాలను గుడి గోపురాల సంస్కృతిని ముందుకు తెస్తూ ఆర్ఎస్ఎస్, బిజెపి, రామజన్మ భూమి, బాబ్రీ మసీదు వివాదం, రథయాత్రలతో అధికారంలోకి వచ్చింది. సంస్కృతిని, కుల వ్యవస్థను, కుల అంతరాలను, శూద్ర, అతిశూద్ర సామాజికవర్గ సాధికారికతను, మహిళా సాధికారికతను పట్టించుకోక పోవడంవల్ల వామపక్షాలు క్రమంగా ప్రజలకు దూరమవుతూ వచ్చారు. ఆయా సామాజిక వర్గాల ప్రత్యేక ఉనికిని, వారి ఆశలను, ఆకాంక్షలను కులతత్వం అంటూ గుర్తించ నిరాకరించారు. ప్రజలను విడదీస్తేనే తమ ఆధిపత్యం నిరంతరం

కొనసాగుతుందని, వర్ణాధిక్యవాదులు హిందూ మతం పేరిట వేల యేళ్ళుగా కులాలమధ్య అంతరాలు సృష్టించి ఒకరికన్నా ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అంటూ విభజించి పాలిస్తున్నారు. వామపక్షాలు దీన్ని పరిష్కరించడానికి సైద్ధాంతిక భూమికలను ఏర్పాటు చేసుకోలేకపోయాయి. ఉద్యమించలేకపోయాయి.

అంబేద్కర్ సమస్త రంగాలలో కొనసాగుతున్న అంతరాలను, వివక్షతలను, అణచివేతలను, ఆర్థిక దోపిడీని, సంస్కృతిలోని అవమానాలను, అసమానతలను విప్పి చెప్పాడు. పరిష్కారం చూపాడు. ఉద్యమాలు చేశాడు. బ్రాహ్మణిజంలో, హిందూ మతంలో స్త్రీలను, పనిచేసేవాళ్ళను తక్కువచేసి చూశారు. అంబేద్కర్ దాన్ని వ్యతిరేకించాడు. వారి శ్రమశక్తిని గుర్తించి సమానత్వం కోసం ఉద్యమించారు.

అభివృద్ధి, అధికారం అందుకున్నవారికి, అందుకోదలచుకున్నవారికి, అందుకోలేకపోతున్నవారికి, అందుకోవాలని కూడా తెలియనివారికి మధ్య నిరంతరం అంతరం ఉంటుంది. అందుకోవాలనుకుంటున్నవారిని ఆధిపత్యంలో ఉన్నవారు అడ్డగిస్తుంటారు. అందుకు అనేక సిద్ధాంతాలను, సంస్కృతి విలువలను రూపొందించి ప్రచారం చేస్తారు. ఈ అసమానతలను పరిష్కరించి అట్టడుగు వర్గాల దాకా అందరికి అభివృద్ధి, అధికారం, సంక్షేమం, విద్య, వైద్యం, ఉద్యోగ, ఆర్థిక సామాజిక రంగాల్లో ఎదగడానికి డా॥ బి.ఆర్. అంబేద్కర్ పలు కోణాల్లో విశ్లేషించి, పరిష్కారాలు చూపి ఉద్యమాలు చేసి, రచనలు చేసి, రాజ్యాంగంలో చేర్చారు.

4. శూద్రులు వృత్తి నిపుణులు, సంపద సృష్టికర్తల

సకల సంపద సృష్టికర్తలు వ్యవసాయ సమాజంలో సాగిన పారిశ్రామిక విప్లవానికి శూద్రులు, అతిశూద్రులు మూలకర్తలు. శూద్రులు ఉత్పత్తి నైపుణ్యాలు కలిగిన కులవృత్తి గలవారు ఆర్టిజాన్స్ తమ కులవృత్తులు, ఆధునిక పరిశ్రమలతో, మార్కెట్‌తో శిథిలమవుతుంటే, వాటి రక్షణకోసం, ఆత్మగౌరవం కోసం, కులసంఘాలను, కులవృత్తి సంఘాలను, కులవృత్తి రక్షణ డిమాండ్లను ముందుకు తీసుకొని మహాత్మా జ్యోతిబా ఫూలే కాలం నుండి ఉద్యమిస్తున్నారు. అయితే వాటికి జాతీయ, రాజకీయ దృక్పథం కొరవడినందువల్ల ఎంతో గొప్ప ఉద్యమాలు సాగినప్పటికీ, అవి జాతీయోద్యమంలో భాగంగా చరిత్ర రికార్డు చేయలేకపోయింది. ఆదివాసీ గిరిజనులు బ్రిటీష్ ఇండియా పాలకులకు వ్యతిరేకంగా 170కి పైగా తిరుగుబాటు చేశారు. ఎన్నో త్యాగాలు

చేశారు. అవి జాతీయోద్యమంలో భాగంగా రికార్డయ్యాయి. బ్రాహ్మణులు, ముస్లింలు, సిక్కులు, డిప్రెస్డ్ క్లాసెస్, సంస్థానాధీశులు మొదలైనవారు చేసిన ఉద్యమాలు, డిమాండ్లు, రచనలు, జాతీయ ఉద్యమ చరిత్రలో భాగంగా, రికార్డయ్యాయి. భూస్వామ్య వ్యవస్థలో వ్యవసాయంతోపాటు అనేక వృత్తులు, కులవృత్తులు రక్షణకోసం అనేక సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసుకున్నారు. 1870లో రైతే రాజు అనే నినాదం ప్రారంభమైంది. భారతీయ సంపద సృష్టికర్తలు శూద్రులు, అతిశూద్రులే అని బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, ఆ సంపదను ఉపయోగించుకున్న వినియోగదారులే అని వి.జె.ఆర్. నారగోని, కంచె ఐలయ్య వంటి వారు అంబేద్కరిజం వెలుగులో విశ్లేషించారు.

5. అంబేద్కర్ తాత్వికత

అంబేద్కర్ మొట్టమొదట ఆంథ్రోపాలజీ అధ్యయనంతో తాత్విక అధ్యయనం మొదలైందని చెప్పవచ్చు. 1916 మే నెలలో ఆంథ్రోపాలజీ సెమినార్‌లో "క్యాస్ట్స్ ఇన్ ఇండియా", "దేర్ మెకానిజం, జెనిసిస్ అండ్ డెవలప్‌మెంట్" అనే పరిశోధనా పత్రం సమర్పించారు. ఈ సిద్ధాంత వ్యాసమే ఆ తర్వాత అంబేద్కర్ మొత్తం రచనలన్నింటిలో విస్తరించింది. మార్క్స్, ఎంగెల్స్‌ల కమ్యూనిస్టు మ్యానిఫెస్టోయే ఆ తర్వాత అన్ని రచనలకి విస్తరింపజేసినట్టుగా 'భారతదేశంలో కులాలు', 'కుల నిర్మూలన', 'విప్లవం–ప్రతిఘాత విప్లవం' అనే తాత్విక సిద్ధాంతాలే అంబేద్కర్ రచనలన్నిటా విస్తరించాయి. భూ కమతాల గురించి అంబేద్కర్ భూమిని తిరిగి ప్రభుత్వ పరం చేయాలని, భూ యజమానులకు కొంతకాలం డివిడెండ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్రిటీషువాళ్లు పన్నులకోసం పెట్టిన వ్యవస్థలలో భూమి పై వ్యక్తిగత ఆస్థి భావన పెరుగుతూ వచ్చింది. అంతకుముందు భూమి సామిక ఆస్థి తప్ప, వ్యక్తిగత ఆస్థి ఉండేది కాదు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ విద్యకు, విజ్ఞానానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. భారీపరిశ్రమలు, భూమి, ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్యాంకులు మొదలైనవన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కోరారు. స్టేట్ సోషలిజం, ప్రజాస్వామ్య సోషలిజంకు మార్గం వేశారు. ఆడవాళ్లకు ఇంటిపని, పిల్లల పెంపకం, వంట, ఇల్లు అలుకుడు మొదలైనవి మహిళలకే పరిమితం చేయడం, కొన్ని వృత్తులు ఫలానా కులాలవారే చేయడం అనేవి మహిళల పట్ల, నిమ్నకులాలపట్ల చిన్నచూపును, వారి శ్రమను చాకిరిగా, విలువలేనిదిగా చూడడాన్ని అంబేద్కర్ వ్యతిరేకించి ప్రత్యామ్నాయ

మార్గాలను చూపారు. సమస్థ, వర్ణ, వర్గ, కుల, లింగ, భాష, దేశ, సంస్కృతి, మత, ప్రాంత వివక్షతలను, అసమానతలను రూపుమాపడం డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారి లక్ష్యం. అదే వారి రచనల్లో, ఆచరణలో ఉన్న తాత్వికత.

6. ప్రపంచంలోని మహోన్నత తాత్వికత "వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్".

"వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్" (ప్రతి మనిషికి ఒకే విలువ. ఒకే ఓటు) అనేది ఎంత గొప్ప తాత్వికతో నేను అనేక తాత్విక గ్రంథాల్లో, రచనల్లో, ప్రసంగాల్లో వివరించాను. దీన్ని బలంగా జీవితమంతా సమస్థరంగాల్లోకి విస్తరింపజేసిన దార్శనికుడు డా॥ బి.ఆర్. అంబేద్కర్. వేల యేళ్ళుగా ఎందరో తత్వవేత్తలు ఎన్నో సిద్ధాంతాలు చేశారు. వాటన్నిటి కన్నా అత్యంత వాస్తవికమైన అత్యున్నత తాత్వికత. అది రాజ్యాంగబద్దమైంది. అన్నిటికి భూమికగా నిలిచింది. దీని ప్రాధాన్యతను బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు గుర్తించాలి. ఇతర దేశాల్లో అనేక ఉద్యమాల తర్వాత సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించబడింది. మహిళలకు ఎంతో ఆలస్యంగా ఓటు హక్కు కల్పించారు.

7. 26 జనవరి 1950కి ముందు మనుషులందరూ సమానం కాదు

భారత రాజ్యాంగం విశిష్ఠతను ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు సరిగ్గా గుర్తించడంలేదు. భారత రాజ్యాంగం మనుషులందరిని సమానం చేసింది. "వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్" (ప్రతి మనిషికి ఒకే విలువ. ఒకే ఓటు) అని స్థిరపర్చింది. 26 జనవరి 1950 నుంచి భారత రాజ్యాంగం ద్వారా ఇది తాత్విక భూమికగా నిలిచింది. దాంతో రాజ్యాంగబద్దంగా మనుషులందరు సమానమయ్యారు. అంతకుముందు మనుషులందరు సమానులు కారు. విభిన్న కులాలుగా, వర్ణాలుగా, వర్గాలుగా, తెగలుగా, జాతులుగా అనేక అసమానతలకు, వివక్షతలకు, వెలివేతలకు, పీడనలకు, అణచివేతలకు గురయ్యే తత్వశాస్త్రాలు, పురాణ ఇతిహాసాలు, మనుస్మృతి, బ్రాహ్మణీయ శాస్త్రాలు, రామాయణం, మహాభారతాలు మొదలైనవి వర్ణ, కుల వ్యవస్థల అసమానతలకు పునాదిగా నిలిచాయి. వాటన్నిటిని పూర్వపక్షం చేస్తూ ఆధునిక సమాజ నిర్మాణం కోసం భారత రాజ్యాంగం ప్రపంచంలో ఒక గొప్ప రాజ్యాంగంగా ముందుకు వచ్చిన రోజు 26 జనవరి 1950.

8. భారత రాజ్యాంగానికి ముందు, భారత రాజ్యాంగానికి తర్వాత

అందువల్ల భారత రాజ్యాంగానికి ముందు, భారత రాజ్యాంగానికి తర్వాత అనే రెండు దశలుగా చరిత్రను, అంబేద్కర్‌ను, భారత జాతీయ ఉద్యమాలను స్వాతంత్ర్యానంతర పరిణామాలలో అంబేద్కర్ ప్రభావాన్ని లెక్కలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అధికారంలో ఉన్నంత కాలం నెహ్రూ, ఇందిరాగాంధీ తదితరుల కాంగ్రెస్ చరిత్ర వారికి పతనిర్దేశకుడైన గాంధీజీ ప్రాభవంలో కొనసాగారు. గాంధీయే దళితులకు ప్రతినిధి అన్నట్టుగా ఊరూరా గాంధీనగర్ పేరుతో హరిజనవాడలు వెలిశాయి. 1970 తర్వాత క్రమంగా ఈ పరిస్థితి మారుతూ వచ్చింది.

9. అంబేద్కరిజం సార్వజనీనత

వివక్ష, వెలివేత, అసమానతలు, పీడన ఎన్ని రూపాల్లో కొనసాగుతున్నదో అవన్నీ పరిష్కరించబడేదాక అంబేద్కర్ భావనలు, పరిష్కారాలు వెలుగు చూపుతూనే ఉంటాయి. అలా సమస్త, వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, భాష, సంస్కృతి, ప్రాంత, దేశ వివక్షతలకు, అసమానతలకు, అణచివేతలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక మద్దతునిస్తూ అంబేద్కర్ పీడితులందరికీ నేనున్నానని స్ఫూర్తినిస్తూ మార్గదర్శక స్ఫూర్తిధాతగా ముందుకు సాగుతూనే ఉంటారు. అలా ఓబీసీలకు కూడా అంబేద్కర్ మార్గదర్శిగా, స్ఫూర్తిదాతగా కొనసాగుతూనే ఉంటాడు. ఆఫ్రికా దేశాలతో పాటు ప్రపంచంలో అనేక దేశాలకు కుల, మత, జాతి, ప్రాంత వివక్షతలకు, అసమానతల సంస్కృతికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో, బహుళ పార్టీ వ్యవస్థలో 'ప్రజాస్వామ్యం, సోషలిజం' కోసం అంబేద్కరిజం స్ఫూర్తి ఇస్తూనే ఉంటుంది.

కుల వివక్ష, జెండర్ వివక్ష, కులవ్యవస్థ, బ్రాహ్మణిజం, క్యాపిటలిజం, భూస్వామ్య సంస్కృతి, పితృస్వామిక పురుషాధిక్య కుటుంబ వ్యవస్థ, వర్ణ వ్యవస్థ ఉన్నంత కాలం అంబేద్కర్ రచనలు మౌలిక భావాల ప్రాసంగికత కొనసాగుతుంటాయి. వాటి రిలవెన్స్ యాభయిఏళ్లకు ఇప్పటికి ఎన్నో రెట్లు పెరిగింది. ఇంకా పెరుగుతుంది. కుల మత జెండర్ వివక్ష, గృహహింస, పితృస్వామిక అసమానతలు లేని ప్రజాస్వామ్య సోషలిజం వ్యవస్థ, లింగ అసమానతలు లేని నూతన కుటుంబ సంస్కృతి ప్రపంచ వ్యాప్తంగా పరిణామం చెందే దాక కొనసాగుతూనే ఉంటాయి.

10. కులం, పుట్టుక అనే సిద్ధాంత వ్యాసంలో పితృస్వామిక వ్యవస్థ, వర్ణ కుల వ్యవస్థ ఎలా రూపొందాయో విశ్లేషించి దడి కట్టుకున్న వర్గమే కులంగా కరుడుకట్టుకుపోయిన తీరును స్పష్టం చేశారు. ఇలా పితృస్వామిక, వర్ణ కులాధిక్య వ్యవస్థల సిద్ధాంతాలకు, సంస్కృతికి, సామాజిక అసమానతలకు, సమస్థ రూపాలకు వ్యతిరేకంగా మనుషులందరూ సమానమే అని అంబేద్కర్ జీవితమంతా ఉ ద్యమించారు. రచనలు చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచారు. 'ప్రతి మనిషికీ ఒకే విలువ ఒకే ఓటు' అని రాజ్యాంగంలో చేర్చడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. అలా అంబేద్కర్ జీవితమంతా ఆధునిక భారతీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారు. ఆధునిక భారతీయ, సామాజిక విప్లవ సిద్ధాంత కర్త డా॥ బి.ఆర్. అంబేద్కర్.

11. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం. సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు. సమస్థ అసమానతలు, వివక్షతలు, దోపిడీల నిర్మూలన. కుల నిర్మూలన, స్త్రీల సమానత్వం, స్టేట్ సోషలిజం, భూమిని, పరిశ్రమలను, బ్యాంకులను, ఇన్సూరెన్స్ కంపెనీలను జాతీయం చేయడం, ప్రభుత్వ ఉద్యోగ, విద్యా రంగాలలో వెనుకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు, విద్య ప్రాముఖ్యత, మానవీయ విలువలు, ప్రపంచ స్థాయిలో భారతదేశం పునర్నిర్మాణం. రాజ్యాంగ నిర్మాణ పరంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ రుణం భారతజాతి తీర్చుకోలేనిదని ప్రథమ రాష్ట్రపతి డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ హిందూ సమాజంలోని కుల, మత, ఆర్థిక దోపిడీ శక్తులపాలిట విప్లవానికి ప్రతీక అని భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు.

12. కులం పునాదులమీద ఒక జాతిని, నీతిని నిర్మించలేం, మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. దేవునిమీద, మహానుభావులమీద ఆధారపడవద్దు. నేను, నా దేశం ఈ రెంటిలో నా దేశమే ముఖ్యమైనది. మితిమీరిన స్వేచ్ఛ సమానత్వాన్ని హరించివేస్తుంది. మహిళలకు సమాన హక్కులు కల్పించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి ఉద్యమించి, రాజ్యాధికారంలోకి రావాలి. రాజ్యాధికారమే అన్ని సమస్యలను పరిష్కరించే మాస్టర్ కీ అన్నారు డా॥ బి.ఆర్. అంబేద్కర్.

13. మాతృభాషతో బ్రాహ్మణిజం

మాతృభాష సిద్ధాంతం కూడా బ్రాహ్మణిజంలో భాగమే. మాతృభాషలో ఉన్నదంతా వర్ణ, కుల వ్యవస్థల సంస్కృతి, అణచివేత, దోపిడీ అసమానతలే. ఇంగ్లీషు నేర్చుకుంటే అంతర్జాతీయ భావాలు తెలుస్తాయి. స్థానిక, జాతీయ బూర్జువాలు, అగ్రకుల పెటీబూర్జువాలు మాతృభాషలో విద్యాబోధన అనే పేరుతో మార్కెట్‌ను, భావజాలాలను, ప్రజల మెదళ్ళను తమ ఆధిపత్యంలో కొనసాగింప చేయడానికే. మహాత్మా జ్యోతిరావు ఫూలే, డా॥ బి.ఆర్. అంబేడ్కర్ ఇంగ్లీషులో చదువుకొని, ఇంగ్లీషులో రాయడం వల్లనే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వారి భావాలు చేరాయి. కంచ ఐలయ్య వంటివారు ఇంగ్లీషు మీడియం పట్ల నొక్కి చెప్పడం బ్రాహ్మణీయ హిందూ వర్ణ, కుల వ్యవస్థ, భాషా సంస్కృతి నుండి విముక్తం చేసి అంతర్జాతీయ మానవులుగా ఎదగడానికే. సంస్కృతం, ఇంగ్లీషు మాతృభాష కాకపోయినా, బ్రాహ్మణులు నేర్చుకున్నారు. మాతృభాషను మార్చుకొనే హక్కు ఉంది. ప్రాథమిక హక్కుల్లో భావాలను వ్యక్తం చేసే హక్కుతో పాటు మాతృభాషను మార్చుకునే హక్కు కూడా ఉంది. దేవాలయాలలో, పెళ్ళిల్లల్లో, సంస్కృతం, పార్లమెంటులో, సుప్రీంకోర్టులో ఇంగ్లీషు మాధ్యమంగా కొనసాగుతున్నది. మాతృభాష మీడియం కోరేవారు. దేవాలయాల్లో, పెళ్ళిల్లలో, పార్లమెంటు, సుప్రీంకోర్టు, పరిపాలనా వ్యవస్థల్లో, మాతృభాష ఎందుకు పనికిరావడం లేదు?. సంస్కృతం, ఇంగ్లీషే ఎందుకు వాడుతున్నారు? క్రీ.శ. ఏడో శతాబ్దం నుండి భారతీయ భాషల్లో బ్రాహ్మణిజం భావాలతో పదాలను, వాక్యాలను, తత్వాలను నింపివేశారు. బౌద్ధ, జైన, నాస్థిక భావాలను, సంస్కృతిని తొలగించి వేశాయి. అలా నేడు మాతృభాషలు బ్రాహ్మణిజం వ్యాప్తికి, బ్రాహ్మణిజం స్థిరపడడానికి బలమైన వాహికగా పనిచేస్తున్నాయి అని మర్చిపోకూడదు.

14. రాజులు, రాజ్యాలు, చక్రవర్తులు భూస్వామ్య వ్యవస్థ

బ్రాహ్మణిజం పట్ల దాని సంస్కృతి, తాత్విక భూమికల ప్రభావం పట్ల కొందరికి భిన్నాభిప్రాయం ఉంది. ముస్లింలు, క్రైస్తవులు తమ మత ప్రచారం కోసం, తమ మతంలో చేరడం కోసం బ్రాహ్మణిజం పట్ల, హిందూమతం పట్ల ఉన్నదానికన్నా ఎన్నో రెట్లు విష ప్రచారం చేశారని వారి అభిప్రాయం. శూద్రులు, అతిశూద్రులను హింసించింది, ఆర్థికంగా, సాంస్కృతికంగా అన్నిరకాలుగా దోపిడీ చేసింది,

అణచివేసింది భూస్వామ్యవర్గం. భూస్వామ్యవర్గంలో అగ్రకులాలు, అగ్రవర్ణాలు ఉన్నాయి. వీరు పన్నులకోసం భూమిని కొంత ప్రాంతాన్ని, కొన్ని గ్రామాలను అప్పగించినప్పుడు అవి వారి వ్యక్తిగత ఆస్థిగా మార్చుకున్నారు. భారత రాజ్యాంగం ఆ భూములనుండి వీరిని తొలగించలేదు. ఆస్థిహక్కు కింద ఆ భూములను భూస్వామ్యవర్గాలు కాపాడుకున్నారు. ఇలా జరుగుతుందని డా॥ బి.ఆర్. అంబేద్కర్ భూ కమతాల గురించి, వాటి రద్దు చేయాల్సిన అవసరం గురించి నొక్కి చెప్పారు. భూమిమీద అధికారం భూస్వాములది, అగ్రవర్ణాలది. దాని బాదితులు శూద్రులు, అతిశూద్రులే. స్వాతంత్ర్యానంతరం తర్వాత ప్రజలు ఉద్యమించినప్పుడు దున్నేవారికే భూమి అని ముందుకు కదలబారినప్పుడు ఆయా రాష్ట్రాల్లో అనేక భూసంస్కరణ చట్టాలు చేయబడ్డాయి. న్యాయస్థానాలు ఆ చట్టాలకు వ్యతిరేకంగా తీర్పునిచ్చాయి. దాంతో జనతా పార్టీ ఆస్థి కలిగి ఉండడం రాజ్యాంగబద్ద ప్రాథమిక హక్కు కాకుండా, చట్టపరమైన హక్కుగా మార్చింది. భూసంస్కరణలకోసం చేసిన చట్టాలను న్యాయస్థానాల పరిధినుంచి తప్పించడానికి వాటన్నిటిని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సి వచ్చింది. ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా, భూస్వామ్య వర్గాలకు అనుకూలంగా న్యాయవ్యవస్థ కొనసాగుతూ వస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం ఇంకా ఎంతో బలంగా వారు ఉన్నారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

15. హిందూ మతం పట్ల ఇతర మతాల భిన్నాభిప్రాయాలు

ఇతర మతాల వ్యాప్తికోసం పనిచేసేవారిచేత భారతీయ ప్రజల మెదళ్లలో నాటబడ్డ బ్రాహ్మణ వ్యతిరేక సిద్ధాంతం అర్థం చేసుకోవడానికి సంస్కృతిలోకి వెళ్లి పరిశీలించవచ్చు. భారతీయ సంస్కృతిలోని నూటికి తొంబై అంశాలు బౌద్ధం, మాతృస్వామిక వ్యవస్థ నెలకొల్పినవి. పితృస్వామిక వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, బ్రాహ్మణీయ వ్యవస్థ, వర్ణ కుల వ్యవస్థ నెలకొల్పిన ఆధిపత్యాలు, దోపిడీ సంస్కృతి మానవీయ సంస్కృతిమీద రుద్దబడ్డాయి. సామాజిక స్వామ్యవాదం, ఈ ఆధిపత్యవాదాలు రెండూ జీవితంలో పరస్పరం నిత్యం సంఘర్షిస్తున్నాయి. వేల యేళ్ళుగా భారతదేశంలోని రాజులు, రాజ్యాలు, చక్రవర్తులు, శూద్రులు, ఇతర మతాలవారే. ఎప్పుడో కొద్దికాలం బ్రాహ్మణులు రాజ్యాలు ఏలారు. ఈ విషయాన్ని జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్‌ల కోణంలో 'భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం' అనే గ్రంథంలో సోదాహరణంగా వివరించడం జరిగింది.

16. పరస్పర అంగీకారంతో సాధించిన విజయాలే భారత రాజ్యాంగం

పరస్పరం అంగీకారంతో సాధించిన విజయాలే భారత రాజ్యాంగం. అందులో వాయిస్ గ్రూపుగా ఉన్నవారు, అందులో లేనివారిని కూడా పట్టించుకున్నారు. మహిళలు, బాలలు లేకపోయినప్పటికీ వారి గురించి పట్టించుకున్నారు. ఓబీసీలు బలమైన వాయిస్ ఇవ్వగలిగినవారు ఎవరూ లేకపోయినప్పటికీ అనేక ఆర్టికల్స్‌ను చేర్చి రక్షణను కల్పించారు. తర్వాత తీసుకోవాల్సిన చర్చల కోసం అవకాశమిచ్చారు. చర్యలకోసం, చట్టాలకోసం అవకాశాలిచ్చారు. అందరిని ఒప్పించిన రాజ్యాంగం అన్నింటికన్నా గొప్పది. ఆచరణలో ఉన్నది.

17. మాతృస్వామిక సంస్కృతి రూపాలు

పితృస్వామిక వ్యవస్థలకు సమాంతరంగా, మాతృస్వామిక సంస్కృతి అనేక రూపాల్లో సమాంతరంగా కొనసాగుతూనే వచ్చింది. మహాత్మా జ్యోతిబాఫూలే, సావిత్రిబాయి ఫూలే, పవుల్ జయకర్ (మదర్ గాడెస్సెస్), డా॥ కత్తి పద్మారావు (పితృస్వామిక వ్యవస్థలో స్త్రీ), కంచె ఐలయ్య (వై అయామ్ నాట్ హిందూ) వంటి ఎందరో వీటిని వెలికితీసి చెప్పారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ పితృస్వామిక అణచివేతను, కుల వ్యవస్థ అణచివేతను రెంటినీ తన మొదటి సిద్ధాంత వ్యాసంలోనే పేర్కొన్నాడు. భారతదేశంలో కులాలు అనే మొదటి సిద్ధాంత వ్యాసమే. మొత్తం రచనలన్నింటిలో భావదారలో, రాజకీయాల్లో విస్తరించింది. ఎలాగైతే మార్క్స్, ఎంగెల్స్‌లు, కమ్యూనిస్టు మ్యానిఫెస్టోయే మిగతా అన్ని రచనలకు విస్తరించిందో అలాగే భారతదేశంలో కులాలు అనే సిద్ధాంత ప్రతిపాదనలే అంబేద్కర్ అన్ని రచనల్లోకి విస్తరించింది.

18. జాతీయ ఉద్యమ కాలం – కులసమస్య

హిందూ మతంలోని వర్ణ, కుల వ్యవస్థలను, స్త్రీల అణచివేతలను స్థిరపరిచే సంస్కృతిని, ఆర్థిక దోపిడీని, అవమానాలను, ఆత్మన్యూనతను, పితృస్వామిక వ్యవస్థను, మహిళల అణచివేతపై నిలబడిన, స్థిరపడిన హిందూ సంస్కృతిని, అసమానతలను, ఆర్థిక దోపిడీని నిర్మూలించాలనిగానీ, పరిశీలించాలని గానీ, పరిష్కరించి, సమానత్వం దిశగా సమాజాన్ని ఆధునీకరించాలనిగానీ హిందూ మత జాతీయవాదులైన గాంధీ, నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్, బాలగంగాధర్ తిలక్, వల్లభాయ్ పటేల్

అనుకోలేదు. పైగా చాలా సందర్భాల్లో హిందూ సంస్కృతి గొప్పది అంటూ విప్లవాత్మక సంస్కరణలను వ్యతిరేకించారు. స్త్రీలకు సమాన హక్కులకోసం, ఓబీసీలకు సమాన హక్కుల కోసం డా॥ బి.ఆర్. అంబేద్కర్ చేసే ప్రతి ప్రయత్నానికి అడ్డు తగిలారు. చివరకు న్యాయశాఖామంత్రిగా ఉన్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఈ రెండు సాధించలేకపోతున్నందున రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. మొదటినుంచి డా॥ బి.ఆర్. అంబేద్కర్ 'బ్రాహ్మణిజం–క్యాపిటలిజం' ఈ దేశానికి, ప్రజలకు ప్రధాన శత్రువులు అని విస్పష్టంగా పేర్కొన్నారు. కాగా బ్రహ్మసమాజం, ఆర్యసమాజం, హిందూ మత సంస్కరణలకు పూనుకొని సంస్కృతీకరణకు పరిమితమయ్యాయి. శూద్రులు, ఓబీసీలు వీటిపట్ల ఆకర్షితులై హిందూమతం పరిధిలోనే ఉండిపోయారు. రాజకీయ అధికారం కోసం సంఘటిత వర్గంగా ముందుకు రాలేకపోయారు. కాంగ్రెస్, తదితర సంస్థల్లో అనుబంధ సంఘాలుగా కొనసాగుతూ వచ్చారు. నిజామాంధ్ర మహాసభలో చేనేత కులాలవారు, మహిళలు అనుబంధ సంఘాలుగా కొనసాగుతూ వారి డిమాండ్లపై తీర్మానాలను సాధించుకున్నారు. 1917 నుండి 1934 దాకా శూద్రులైన ఓబీసీలు రాజకీయ హక్కుల విషయంలో ఇగ్నోర్ చేయబడ్డారు. కుల సంఘాలకు, కులవృత్తి సంఘాలకు, కులవృత్తి రక్షణలకు, ఆకలి పోరాటానికి పరిమితమయ్యారు. గాంధీజీ హామీలు వారిని ఆకర్షించాయి. కాంగ్రెస్, గాంధీ ఓబీసీలను ఒక పథకం ప్రకారం మభ్యపెడుతూ, వంచిస్తూ వచ్చారు.

19. అంబేద్కర్ తాత్విక వారసత్వం

బుద్ధుడు, కబీర్‌దాస్, గురు రవిదాస్, మహాత్మా జ్యోతిభా ఫూలే, పెరియార్ రామస్వామి నాయకర్, నారాయణగురు, హయతీదాస్, సంత్ గాడ్గే బాబా మొదలైన మహనీయుల స్ఫూర్తిని అంబేద్కర్, అంబేద్కరిజం తనవెంట ముందుకు తీసుకువెళ్తూనే ఉంటుంది. ఇలా ఒక సమగ్రతలో అంబేద్కర్‌ను చూడాలి. భారత రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ఓబీసీల హక్కులను సాధించాల్సిన లక్ష్యాలను సాధించుకోవడానికి రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను, అంబేద్కరిజాన్ని భారత చరిత్రను నిరంతరం అధ్యయనం చేయడం అవసరం. స్ఫూర్తిపొందడం అవసరం.

20. రోజురోజుకు విస్తరిస్తున్న డా॥ బి.ఆర్. అంబేద్కర్

1990లో అంబేద్కర్ శత జయంతి ఉత్సవాల సన్నాహంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాలక్రమంలో అందరూ వెనుకబడిపోయారు. అంబేద్కర్

రోజురోజుకు విశ్వరూపంపై వెలుగు కిరణాలు ప్రవేశించాయి. మొట్టమొదటగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి శరద్ పవార్ 1978లో అంబేద్కర్ రచనలన్నిటిని సంకలనాలుగా తీసుకురావడానికి ప్రభుత్వ పరంగా కృషి చేశారు. అలా అంబేద్కర్ కృషి, ప్రసంగాలు, రచనలు విస్తృతంగా ప్రజల్లోకి చొచ్చుకొని వచ్చాయి. తొలుత ఇంగ్లీషులో వచ్చినప్పటికీ క్రమంగా మరాఠీ, హిందీ, తెలుగు తదితర భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఈ సంకలనాలు రాకముందే ఎక్కడికక్కడ ఆయా భాషల్లో అంబేద్కర్ ముఖ్య రచనలు వెలువడుతూ వచ్చాయి. 'కుల నిర్మూలన', 'శూద్రులెవరు?', 'అస్పృశ్యులెవరు?', 'అంబేద్కర్ జీవిత చరిత్ర', 'బుద్ధుడు కారల్ మార్క్స్', 'బౌద్ధం ఉత్తాన పతనాలు' మొదలైనవి వాటిలో కొన్ని. అంబేద్కర్ జీవిత చరిత్ర లక్షలాదిమందిని ఉత్తేజపరిచింది. ధనుంజయ్ కీర్, మహాత్మా జ్యోతిబా ఫూలే, డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ల జీవిత చరిత్రను రాశారు. ఎండ్లూరి చిన్నయ్య, బొజ్జా విజయభారతి, వసంత మూన్, మధులిమయే మొదలైనవారు అంబేద్కర్ జీవిత చరిత్రను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళారు. అంబద్కేర్ కృషి పట్ల నిరంతరం అధ్యయనం కొనసాగుతున్నది.

21. ఈ దేశంలో ప్రధాన సమస్యలు

ఈ దేశంలో ప్రధాన సమస్య ఓబీసీల సమస్య. మహిళల సమస్య. భూమి సమస్య, పెట్టిబడిదారి దోపిడీ సమస్య, రాజరికాల, భూస్వామ్య వ్యవస్థల సంస్కృతి, సమస్థ వివక్షతల, వెలివేతల, అసమానతల సమస్యలే భారతదేశ ప్రధాన సమస్య. అందరికీ కూడు, గుడ్డు, నీడ, సమాన అవకాశాలు, స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం అందుకునే విధంగా అందుకు చేయూతనిచ్చేవిధంగా, రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగం రూపొందించబడింది. రూపొందించడం ఒక ఎత్తు. అది ఆచరణలోకి తెచ్చుకోవడం ఒక ఎత్తు. ఆచరణలోకి తెచ్చుకోవడం కోసం కూడా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇది నిరంతర ప్రక్రియ.

22. భారత రాజ్యాంగ డ్రాఫ్ట కమిటీ ఛైర్మన్‌గా డా॥ బి.ఆర్. అంబేద్కర్

భారత రాజ్యాంగ డ్రాఫ్ట కమిటీ ఛైర్మన్‌గా భారత రాజ్యాంగం డా॥ బి.ఆర్. అంబేద్కర్ చేతుల మీదుగా తుదిరూపం తీసుకున్నది. వారి చొరవతో రాజ్యాంగంలో

అందరితోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు, మహిళలకు, బాలలకు, అనేక హక్కులు పొందుపరచబడ్డాయి.

23. భారత రాజ్యాంగంలో 'ప్రజాస్వామ్య సోషలిజం'

భారత రాజ్యాంగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, ఇతర సామాజిక వర్గాలకు సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు సాధించడం, స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం, అందరికీ సమాన అవకాశాలు, సమాన అవకాశాలు అందుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, రక్షణలు, భారత రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి. ప్రజాస్వామ్య సోషలిజానికి భారత రాజ్యాంగం హామీ ఇస్తుంది. భారత రాజ్యాంగంలోని ఈ కింది ఆర్టికల్స్ అందుకు హామీ ఇస్తాయి.

1. ఆర్టికల్-12 ప్రాథమిక హక్కులు
2. ఆర్టికల్-14 చట్టం ముందు అందరూ సమానులే
3. ఆర్టికల్-15 సమస్త వివక్షల, అసమానతల నిర్మూలన కోసం
4. ఆర్టికల్-16 ప్రభుత్వోద్యోగ అవకాశాల్లో సమానావకాశాలు
5. ఆర్టికల్-17 అస్పృశ్యత, అంటరానితనం నిషేధం...
6. ఆర్టికల్-19 వాక్స్వాతంత్ర్యం మొదలైన హక్కుల పరిరక్షణ
7. ఆర్టికల్-21ఎ నుండి 22 విద్యను అభ్యసించే హక్కు,
8. ఆర్టికల్-25 నుండి 29 భావ ప్రకటన స్వేచ్ఛ....
9. ఆర్టికల్-36, 37 ఆదేశిక సూత్రాలు
10. ఆర్టికల్-38 ప్రజా సంక్షేమం - సామాజిక వ్యవస్థ
11. ఆర్టికల్-39, 39ఎ ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వ కర్తవ్యాలు
12. ఆర్టికల్-46 ఎస్సీ, ఎస్టీ, బీసీల విద్య, తదితరాలు
13. ఆర్టికల్ 330 : ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు..
14. ఆర్టికల్ 338: జాతీయ ఎస్సీ కమిషన్
15. ఆర్టికల్ 338ఎ: జాతీయ ఎస్టీ కమిషన్
16. ఆర్టికల్ 340 : జాతీయ బీసీ కమిషన్
17. ఆర్టికల్ 341 : షెడ్యూల్డ్ కులాలు
18. ఆర్టికల్ 342 : షెడ్యూల్డ్ తెగలు

24. భారత రాజ్యాంగంలో ప్రత్యేకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఆర్టికల్స్ అన్నీ కలిపి 30-40 పేజీల వరకు ఉంటాయి. ఇదేమి చిన్న విషయమేం కాదు. అదనంగా అందరికి ఉండే హక్కులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు, మహిళలకు కూడా సమానంగా ఉంటాయి. విద్యావంతులకు సైతం రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక ఆర్టికల్స్, రక్షణలు తెలియకపోవడం విచారకరం. ఇందుకు ప్రత్యేకంగా విస్తృత ప్రచారం అవసరం.

25. ఆర్టికల్ 32 ప్రాథమిక హక్కుల పరిరక్షణ మార్గాలు:

రాజ్యాంగంలోని ఈ విభాగం ద్వారా ప్రజలకు సంక్రమింప జేయబడిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, సమయోచితమైన రీతిలో సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. రాజ్యాంగం ఈ మేరకు హామీ ఇస్తుంది. డా॥ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో ఈ 32వ ఆర్టికల్ అన్నిటికన్నా ముఖ్యమైనదని అన్నారు. ఈ ఆర్టికల్ ద్వారానే హక్కులన్నిటినీ న్యాయస్థానం ద్వారా సాధించుకోవచ్చు అన్నారు.

26. భారత ప్రభుత్వ చట్టం, 1935

ప్రతి పది సంవత్సరాలకు రాజ్యాంగం సమీక్షించుకోవాలని బ్రిటీష్ ప్రభుత్వంతో కుదిరిన అవగాహనతో 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం బ్రిటీషు పార్లమెంట్ ఆమోద ముద్ర పొంది 1935 ఆగష్టు 2న చట్టంగా రూపొందింది. ఈ చట్టం చాలా విస్తృతమైంది. ఈ చట్టంలో 321 ఆర్టికళ్ళు, 13 షెడ్యూళ్లు ఉన్నాయి. బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ చట్టాలన్నింటిలోను 1935 చట్టం అత్యంత కీలకమైంది. 1935 భారత ప్రభుత్వ చట్టం వివరణాత్మకమైన, విస్తృత శాసనం. ఇందులో 321 ఆర్టికళ్ళు ఉన్నాయి. బ్రిటిషు పాలిత ప్రాంతాలలోనూ, సంస్థలలోనూ, అఖిల భారత సమాఖ్య అనే ఒక నూతన వ్యవస్థను ఈ చట్టం ప్రవేశపెట్టింది. పరిపాలనా అంశాలను 3 జాబితాలుగా విభజించారు. 1935 భారత ప్రభుత్వ చట్టంలో ఇతర సామాజిక వర్గాల రిజర్వేషన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన్లు కూడా చేర్చారు. భారత రాజ్యాంగ చరిత్రలో 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం ఒక స్పష్టమైన ముందడుగు.

27. భారత స్వాతంత్ర్య చట్టం, 1947

ఈ చట్టాన్ని లార్డ్‌మౌంట్‌బాటన్ ప్రణాళిక అని కూడా అంటారు. మౌంట్ బాటన్ ప్రణాళిక భారతదేశ విభజనకు ఆధారం అని చెప్పవచ్చు. ఈ ప్రణాళిక ప్రకారం

బ్రిటిషు పార్లమెంట్ భారత స్వాతంత్ర చట్టాన్ని 1947 జులై 5, ఆమోదించింది. ఇది 1947 జులై 18న బ్రిటీషు రాజరికం ఆమోదాన్ని పొందింది. ఈ చట్టం 1947 ఆగష్టు 15 నుంచి అమలులోకి వచ్చింది. భారత స్వాతంత్ర్య చట్టాన్ని పురస్కరించుకొని, ఇండియా, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు అవతరించాయి. భారత రాజ్యాంగం సుదీర్ఘమైనది. భారత రాజ్యాంగంలో శాసన నిర్మాణ, పరిపాలన, ఆర్థిక సంబంధాలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఎలా ఉండాలో, ఆ నిబంధనలను విస్తృతంగా వివరించారు.

28. భారత రాజ్యాంగం రూపకల్పన

1948, జనవరి నెలలో రాజ్యాంగం తొలి ముసాయిదా ప్రతి (చిత్తు ప్రతి) విడుదల అయింది. ఆ చిత్తు ముసాయిదాకు వివిధ వర్గాల నుండి, ప్రజల నుండి 7,635 సవరణలు వచ్చాయి. వాటిలో 2,473 సవరణలపై ఉప సంఘం చర్చించింది. 26-11-1949న నూతన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. తొలి రాజ్యాంగ ప్రతిపై 24-1-1950 తేదీన 284 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు సంతకాలు చేశారు. అలా నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం. 1950 జనవరి 26 నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అదే గణతంత్ర దినం అనే రిపబ్లిక్‌దే.

29. రాజ్యాంగంలోని షెడ్యూళ్ళ ప్రత్యేకత

రాజ్యాంగంలో చేర్చిన షెడ్యూళ్ళు కూడా ప్రత్యేకంగా ఆర్టికల్స్ వంటివే. రాజ్యాంగ రచనా కాలంలో చేర్చిన 8 షెడ్యూళ్ళు ప్రస్తుతం 12 అయ్యాయి. ఆర్టికల్ 14, 15, 16ల కోసం ప్రత్యేకంగా మరొక షెడ్యూల్‌ను చేర్చాల్సిన అవసరం ఉంటుంది. తద్వారా న్యాయస్థానాల పరిధినుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక చట్టాలు, సౌకర్యాలు, వారి ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు అమలులోకి తెచ్చుకునే విధివిధానాలు, రిజర్వేషన్లు, ప్రత్యేక సబ్‌ప్లాన్‌లు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీలు, ప్రత్యేక విశ్వవిద్యాలయాలు, ప్రత్యేక పరిశ్రమలు, విద్య, ఉద్యోగ రంగాల రిజర్వేషన్లు, ప్రమోషన్లు, వాటి గురించిన విచారణ చేసే అధికారాలను న్యాయస్థానాల పరిధి నుండి మినహాయిస్తారు.

30. స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగుతున్న భూస్వామ్య వ్యవస్థ

స్వాతంత్ర్యానంతరం కూడా భూస్వామ్య వ్యవస్థ కొనసాగుతున్నదని కొందరు

వామపక్షవాదులు సిద్ధాంతీకరిస్తుంటారు. వారు అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థ అని పేర్కొంటారు.

1947లో బ్రిటిష్ పాలకులు వెళ్లిపోయారు. అలా కేంద్రంలో భారతీయులు వచ్చారు. రాష్ట్రాలలో భారతీయులు వచ్చారు. జిల్లాల్లో కూడా కలెక్టర్ వంటి వ్యవస్థ ద్వారా అధికారాలు మార్చబడ్డాయి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో భూమిపై పన్నులకోసం అధికారులకు అప్పగించబడిన భూములు అధికారాలు వారి నుండి తొలగించబడ లేదు. ఒక తాసిల్దార్ తన పరిధిలోని ప్రభుత్వ భూమిని తన ఆస్తిగా మార్చుకోలేడు కానీ గ్రామాల్లో గ్రామీణ అధికారులకు వ్యక్తిగత ఆస్తిగా మారిపోయింది. తద్వారా ఆ సామాజిక వర్గం స్వతంత్ర ఫలాలను అభివృద్ధిని అందుకుంటున్నాయి.

31. నైజాం రాజ్యం ప్రాతినిధ్యంలేని భారత రాజ్యాంగ రచన

భారత రాజ్యాంగ రచనలో నైజాం రాజ్యం ప్రాతినిధ్యం లేదు. అనేక సంస్థానాల నుండి ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ నైజాం రాజ్యానికి రాజ్యాంగ నిర్మాణంలో లేకపోవడం చారిత్రక వాస్తవం. నైజాం స్టేట్ భారత యూనియన్‌లో 17 సెప్టెంబర్ 1948లో విలీనమైనప్పటికీ రాజ్యాంగ పరిషత్‌లో జనాభా, రాజ్య విస్తీర్ణాన్ని అనుసరించి 18 మందిని, కనీసం 8 మందిని రాజ్యాంగసభకు కో-ఆప్ట్ చేసుకోవాల్సి ఉండింది. అలా జరగలేదు. రాజ్యాంగ పరిషత్‌లో నైజాం రాజ్యంలోని కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలనుండి రాజ్యాంగ పరిషత్ సభ్యులను చేర్చుకుని ఉంటే రాజ్యాంగంలో మరికొన్ని అంశాలు అదనంగా చేరి ఉండేవి. నైజాం రాజ్యం నుంచి భారత రాజ్యాంగ నిర్మాణంలోకి తీసుకొని ఉంటే నైజాం రాజ్యానికి కాశ్మీర్‌కు వర్తింపజేసిన 370, 371 ఆర్టికల్స్‌ను నైజాం రాజ్యానికి కూడా వర్తింపజేసి, ఇతర ప్రాంతాల వలసలకు అడ్డుకట్ట వేసి ఉండేవారు. వయోజన ఓటు హక్కు, సార్వత్రిక ఓటు హక్కు లేకుండా ఎన్నికైన ప్రతినిధులు భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. వన్ మ్యాన్ వన్ వ్యాల్యూ, వన్ ఓటు అనే సార్వత్రిక ప్రయోజన ఓటు హక్కుతో 1952లో ఏర్పడిన పార్లమెంటు ఈ రాజ్యాంగాన్ని ఆమోదించే చర్చలు చేయలేదు. ఆ చర్చ ప్రవేశపెట్టబడలేదు అని తమిళనాడు బీసీ కమిషన్ ఆనాటి ఛైర్మన్ జస్టిస్ ఎం.ఎస్. జనార్ధనం తన బీసీ కమిషన్ నివేదికలో పేర్కొన్నారు. 1952లో పార్లమెంటులో రాజ్యాంగం ఆమోదిస్తూ చర్చ జరిగి ఉంటే మహిళలకు, బీసీలకు

చట్టసభల్లో ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో, న్యాయ వ్యవస్థలో దామాషా మేరకు ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధం చేసి ఉండేవారు అని ఆ మాటను అర్థం చేసుకోవచ్చు.

32. అన్ని రంగాల్లో ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతినిధ్యం ఆవశ్యకత

చట్ట సభలకు ప్రాదేశిక నియోజకవర్గాల ద్వారా ప్రతినిధులున్నారు. పరిపాలనా యంత్రాంగంలో కూడా ఐఏఎస్ మొదలుకొని నాన్ గెజెటెడ్ అధికారి దాకా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ప్రాదేశిక నియోజకవర్గాల ప్రకారం ఉద్యోగులు, అధికారులు ఎన్నికయ్యే వ్యవస్థను అమలు జరుపుకోవాలి. న్యాయ వ్యవస్థలో కూడా ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా 'ఇండియన్ జుడిషయల్ సర్వీస్' వంటి పరీక్షల ద్వారా హైకోర్టు, సుప్రీంకోర్టు, న్యాయమూర్తుల ఎంపిక జరగాలి. అలాగే ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా పారిశ్రామికీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి. పరిపాలనా అధికారం యంత్రాంగంతో నియామకాలు, న్యాయవ్యవస్థలో నియామకాలు, ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా జరగడం అవసరం. నీట్ పరీక్షవలె అఖిలభారత స్థాయిలో పరీక్షలు నిర్వహించి, స్థానికత ఆధారంగా నియామకాలు, ఎంపిక చేయడం అవసరం. అప్పుడే పూర్తిస్థాయిలో అన్ని ప్రాంతాలకు, అన్ని సామాజిక వర్గాలకు ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్యం లభిస్తుంది. అప్పటిదాకా రాజకీయ రంగంలో సమాన అవకాశాలు మాత్రమే ఉండి మూడింట ఒకటవ వంతు ప్రజాస్వామ్యం కొనసాగుతుంది. మిగతా పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ అనే రెండు మూల స్థంబాల్లో అన్యాయం, అసమానతలు కొనసాగుతూనే ఉంటాయి.

33. రాజ్యాంగంలో సోషలిజం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం

సోషలిజం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి మూలస్తంభాలుగా ఉన్నాయి. ఈ మూడు అంశాలు అనేక ఆర్టికల్స్ రూపంలో పడుగుపేకలుగా రాజ్యాంగంలో అల్లుకుని పోయాయి. రాజ్యాంగం పార్ట్ 4లోగల ఆదేశిక సూత్రాలలో సోషలిజపు భావనలు అంతర్లీనమై ఉన్నాయి. ఈ 4వ భాగం ప్రజలకు సామాజిక, ఆర్థిక, విద్యా సాంస్కృతిక నైతికపరమైన హక్కులను ప్రజలకు ప్రసాదిస్తున్నది. 3వ భాగం ప్రాణానికి, స్వేచ్ఛకు, భావప్రకటనా స్వేచ్ఛకు, వాక్స్వా తంత్ర్యానికి, మత స్వేచ్ఛకు హక్కులను కల్పిస్తున్నది. వీటిని ప్రాథమిక హక్కులు, పౌర హక్కులంటున్నారు.

34. భారత రాజ్యాంగం ప్రవేశిక (ప్రియాంబుల్) ఆదేశిక సూత్రాలు

"భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర వ్యవస్థ' (సోషలిస్ట్, సెక్యులర్, డెమొక్రటిక్, రిపబ్లిక్) గా రూపొందించు కోవటానికి చిత్తశుద్ధితో తీర్మానించుకున్నాము.

ప్రజలందరికీ, ప్రజాస్వామ్య గణతంత్ర ఫలాలు అందడానికి న్యాయం (జస్టిస్): సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ; స్వేచ్ఛ (లిబర్టి): ఆలోచనలో, భావ ప్రకటనలో, విశ్వాసంలో, ఆరాధనలో; సమానత్వం (ఈక్వాలిటి): సమాన గౌరవం, అందరికి సమాన అవకాశాలు; సౌభ్రాతృత్వం (ఫ్రాటర్నిటి): వ్యక్తి గౌరవాన్ని, జాతి ఐక్యతను, సమగ్రతను పెంపొందించే; మా రాజ్యాంగ సభలో 26 నవంబర్, 1949 నాడు ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి, రాజ్యాంగంగా రూపొందించుకొని మాకు మేము సమర్పించుకుంటున్నాము".

ప్రవేశికల లక్ష్యాల విస్తరణే రాజ్యాంగం. ప్రవేశిక లక్ష్యాలు ఆదేశిక సూత్రాల్లో విస్తరించబడ్డాయి. ప్రవేశిక, ఆదేశిక సూత్రాలకు లోబడి ప్రాథమిక హక్కులు, చట్టాలు పరిపాలన, న్యాయ వ్యవస్థ కొనసాగుతాయి. 42వ రాజ్యాంగ సవరణ చట్టం 1976, (రాజ్యాంగ ప్రవేశిక ఇది)

35. అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్‌లతో ఓబీసీల రిజర్వేషన్లకోసం మొదటి రాజ్యాంగ సవరణ

సాహు మహరాజ్ 1901లో బ్రాహ్మణేతరులకు ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. మద్రాసు రాష్ట్రంలో 1916 నుండి నాన్ బ్రాహ్మిణ్స్ పేరిట శూద్రులకు, బీసీలకు, ఎస్సీలకు స్కూళ్ళు, హాస్టళ్ళు ప్రారంభించబడ్డాయి. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టబడ్డాయి. ఓబీసీలకు రాష్ట్రాల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకోసం మొదటి రాజ్యాంగ సవరణ న్యాయ శాఖామంత్రిగా ఉన్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ చేతులమీదుగా జరిగింది. మద్రాసు రాష్ట్రంలో ఓబీసీలకు విద్యారంగంలో కల్పించిన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ చంపకం దొరై రాజన్ వేసిన కోర్టు కేసులో రిజర్వేషన్లు కొట్టివేశారు. ఇది సమాన ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని తీర్పు చెప్పారు. ఆ తీర్పుకు వ్యతిరేకంగా మద్రాసు రాష్ట్రంలో పెరియార్ రామస్వామి నాయకర్, సి.ఎన్. అన్నాదురై తదితరుల నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం సాగింది. ఆ ఉ

ద్యమం చోదక శక్తిగా రాష్ట్రాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టే క్లాజ్‌ను చేర్చుతూ భారత రాజ్యాంగం మొదటి రాజ్యాంగ సవరణ చేయడం జరిగింది.

36. బ్రాహ్మణిజంలో భాగంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు

మరో మాటలో చెప్పాలంటే భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట బ్రాహ్మణిజం తన అస్థిత్వాన్ని పెంచుకుంటూ వచ్చింది. అందువల్లే జాతుల సమస్య పేరిట సాగిన సిద్ధాంత చర్చల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల జాతీయవాదాన్ని నిరాకరిస్తూ జాతీయవాదులుగా, జాతీయ అగ్రకుల పెట్టుబడిదారులుగా మధ్య తరగతిని వారి ప్రయోజనాలు మాత్రమే జాతుల సమస్యగా, జాతీయోద్యమంగా, ప్రాంతాల సమస్యగా, భాషా రాష్ట్రాల ఉద్యమాల సమస్యగా సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. సిద్ధాంతాలను బ్రాహ్మణిజం వారికి వ్యతిరేకంగా బ్రాహ్మణేతర ఉద్యమాలు వచ్చినప్పుడల్లా కొత్త రూపాల్లోకి తమ సిద్ధాంతాన్ని మార్చి ప్యారడైమ్ షిఫ్ట్ చేస్తుంటారు. అంబేడ్కర్ భాషా ప్రయుక్త రాష్ట్రాల గురించి చేసిన హెచ్చరికలు చాలామంది అర్థం చేసుకోలేదు. కాకా కాలేల్కర్ కమిషన్, మండల్ కమిషన్ సందర్భంగా ఇది గమనించవచ్చు. ఎస్సీలు, బీసీలు కలిసి ఉద్యమించాలని అంబేడ్కర్ చేసిన ప్రయత్నాలను గండి కొట్టడానికై కాకా కాలేల్కర్ కమిషన్ వేసి వాయిదా వేశారు. తర్వాత నిరాకరించారు. అలాగే మండల్ కమిషన్ అమలు సందర్భంగా కమండల్, రామజన్మభూమి, బాబ్రీ మసీదు సమస్యలను, మెరిట్ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి ప్యారడైమ్ షిఫ్ట్ చేశారు. ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారు. చివరకు అదే ఇష్యూతో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఇలా చరిత్ర పొడవునా నూతనంగా ఎదుగుతున్న ప్రజల చైతన్యాన్ని పక్కదారి పట్టించడానికి బ్రాహ్మణిజం తన సిద్ధాంతాలకు కొత్తరూపం ఇచ్చి ప్యారడైమ్ షిఫ్ట్ చేస్తుంది. ముస్లింలను శత్రువులుగా చూపిస్తుంది.

37. మతాంతరీకరణకు బ్రాహ్మణిజమే కారణం

భారతదేశంలోని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల ముస్లింల్లో 90 శాతం ప్రజలు బ్రాహ్మణిజం ఆధిపత్య వాదాన్ని, దోపిడీని, ఆర్థిక దోపిడీని, సంస్కృతిని, అసమానతలను వ్యతిరేకిస్తూ, సామాజిక సమానత్వం కోరుతూ ఇస్లాం స్వీకరించారు. ఈ విషయాన్ని పక్కదారి పట్టించి ముస్లింలను దేశద్రోహులుగా ప్రచారం చేస్తుంటారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుంటారు. ఓబీసీలు హిందూ

అసమానతల సంస్కృతిపై కూరుకుపోయి తమ సోదరులైన, తమకన్నా ముందు చైతన్యం పొంది ఇస్లాంలో చేరిన బీసీ, ఎస్సీలను వ్యతిరేకిస్తుంటారు. బ్రాహ్మణిజం ఇలా ప్రతీసారి ప్రతీఘాత విప్లవాన్ని విప్లవ రూపంలో ముందుకు తెస్తూ ఉంటుంది.

38. సైమన్ కమిషన్ నివేదికలో రికార్డు కానివేవీ ఆ తర్వాత జాతీయోద్యమ చరిత్రలో భాగంగా రికార్డు కాకుండా పోతున్నాయి. ఉదాహరణకు ఆంధ్రా ప్రాంతంతో సహా కలిసి ఉన్న మద్రాసు రాష్ట్రంలో పానగల్ రాజా తదితరుల నాయకత్వంలో నాన్ బ్రాహ్మిణ్ ఉద్యమం, శూద్రుల విద్య, సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. పరిపాలన సంస్కరణలు చేపట్టారు. స్కూళ్ళు పెట్టారు. అలాగే సాహు మహరాజ్ 1901లో నాన్ బ్రాహ్మిణ్ శూద్రులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. ఇవేవీ 1935 రాజ్యాంగ నిర్మాణంలో జాతీయోద్యమ చరిత్రగా రికార్డు కాలేదు. మద్రాసు ప్రావిన్సు నుంచి సైమన్ కమిషన్‌కు నివేదికలు సమర్పించలేదు. అందువల్ల ఆ చరిత్ర బ్రిటీషు ఇండియా రికార్డు చేసిన చరిత్రలో జాతీయోద్యమ చరిత్రగా రికార్డు కాకుండా పోయింది.

39. ఆ కాలంలో వందేళ్ల అడ్వాన్స్ థింకింగ్‌తో బోంబే ప్రెసిడెన్సీలో అంబేద్కర్ చేసిన చర్చలు క్రమంగా జాతీయ స్థాయికి విస్తరించాయి. సైమన్ కమిషన్‌కు నివేదికలు సమర్పించడంతోపాటు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొనడంతో పాటు అనేకసార్లు లండన్ వెళ్లి ప్రత్యేకంగా పాలకులను కలిసి నివేదికలు, చర్చలు చేయడం వల్ల అవి మొత్తం భారత జాతీయోద్యమ చరిత్రగా విస్తరించాయి. బ్రిటీష్ పాలకులు స్వీకరించారు. దానివల్ల అంబేద్కర్ కృషి దేశవ్యాప్తమైంది. ప్రపంచవ్యాప్తమైంది. మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే పూనాలో చేసిన సామాజిక సంస్కరణలు విద్యారంగంలో నెలకొల్పిన పాఠశాలలు మొత్తం భారతజాతిని మేలుకొల్పినట్లుగా అంబేద్కర్ కృషి మొత్తం భారతజాతిని మేల్కొల్పింది. వారి కృషికి అనుకూలంగా, వ్యతిరేకంగా ఎక్కడికక్కడ సంఘర్షణలు, సమర్పణలు ముందుకు సాగాయి. అందువల్ల ఆధునిక భారత సమాజ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ అని అంటున్నాము.

40. ప్రస్తుతం ఓబీసీలకు చట్టసభల్లో, సమస్త రంగాల్లో జనాభా దామాషా మేరకు ప్రాతినిధ్యం అవసరం. అందుకు ప్రొటెక్షన్, రక్షణ, రిజర్వేషన్లు అవసరం.

అందుకు అనువుగా ఇంతదాకా చరిత్ర పరిణామ క్రమంలో విజయాలు సాధించిన అంబేద్కర్‌ను ఎస్సీ రిజర్వేషన్‌లను స్ఫూర్తిగా తీసుకొని వారితో కలిసి ఉద్యమించడం అవసరం. ఎప్పటిదాకా అయితే వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ సిద్ధాంతాలు, ఆచరణ వాటి వివక్ష అనేక రూపాల్లో కొనసాగుతాయో అప్పటిదాకా ఆ వర్ణాధిక్య, కులాధిక్యతా వాదుల ఆధిపత్యమే అన్ని రంగాల్లో కొనసాగుతుంది. అందువల్ల ఓబీసీలు, ఎంబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు అందరు కలిసి ఆ వర్ణాధిక్య, కులాధిక్య వ్యవస్థలకు, సిద్ధాంతాలకు ఆధిక్య రూపాలకు వ్యతిరేకంగా ఉద్యమించి అన్నిరంగాల్లో తమ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు దామాషా మేరకు సాధించుకోవడం అవసరం.

41. 1945-50ల మధ్య భారతదేశ జనాభాను అనుసరించి చట్టసభల్లో సీట్లు నిర్ణయించబడ్డాయి. వీటిలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించబడలేదు. ఆనాటి జనాభా 70 యేళ్ళ తర్వాత నాలుగురెట్లు పెరిగింది. ఆ మేరకు జనాభా ప్రాతినిధ్యం పెరగడానికి సీట్లు పెంచుకోలేదు. సీట్లు పెంచడం ద్వారా అన్ని సామాజిక వర్గాలకు ముఖ్యంగా ఓబీసీలకు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడం వల్ల అందరికి మేలు జరుగుతుంది. గీతను మలుపకుండానే పెద్ద గీత గీయడం ద్వారా మొత్తం అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం లభిస్తుంది. ఇందుకు సాక్ష్యంగా ప్రపంచ దేశాలలో ఉన్న జనాభా నిష్పత్తి ప్రాతినిధ్యంను మార్గదర్శనంగా తీసుకోవాలి. అమెరికా రష్యా చైనా ఆస్ట్రేలియా యూరుపు దేశాల వలె ప్రజల ప్రాతినిధ్యం పెంచడానికి లోక్‌సభలో 2650 సీట్లు , రాజ్యసభలో 1250 సీట్లు, శాసన సభల్లో మూడు రెట్లు సీట్లు పెంచుకోవలసి ఉన్నది. అపుడే ప్రజల ప్రాతినిధ్యం ప్రపంచ దేశాల వలె కొనసాగుతుందని గమనించినాము.

42. ప్రపంచంలో నిరాయుధీకరణ జరగాలి. ఐక్యరాజ్యసమితి ప్రపంచ ప్రభుత్వంగా ఎదగాలి. పాస్‌పోర్టు ఆధార్ కార్డు తప్ప వీసా అవసరం లేని విధంగా ప్రపంచీకరణ అందరి ఆమోదంతో శాంతియుతంగా సాగాలి. ఇంకా ఎన్నో కొత్త కోరికలున్నాయి. బుద్దుడు కోరిన శాంతియుత పరివర్తనకు మరెన్నో కొత్త కోరికలు. ఈ కోరికలు నా కోసం కాదు. భారతీయులందరు సమానంగా ప్రపంచంలో అత్యున్నతంగా ఎదిగడానికి, సమస్త రంగాల్లో అభివృద్ధి, సంక్షేమ, సాంకేతిక నైపుణ్యం నూతన సైన్స్ వికాసం, అన్వేషణలు, జీవన ప్రమాణాలు మూడున్నర రెట్లు పెరుగుతాయి.

43. ఆయాచితంగా వస్తే విలువ తెలియదు

మనం భారతరాజ్యాంగంలో ఉద్యమాలు చేసినా, చేయకపోయినా, కోరినా, కోరకపోయినా, అందరికీ సమాన హక్కులను కల్పించడం జరిగింది. బహుశా అందువల్లనేమో ఓటు హక్కుయొక్క విలువ, భారత రాజ్యాంగం యొక్క విలువ, ప్రాథమిక హక్కుల యొక్క విలువ తెలియక రకరకాల ప్రలోభాలకు, ప్రభావాలకు లోనై మెజారిటీ ప్రజలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోకుండా తమను అణచివేసే, దోపిడీ చేసే ఆధిపత్య వర్గాలవారిని, కులాలవారిని, అసమానతల సంస్కృతిని, సనాతన ధర్మం పేరిట అణచివేతలను, దోపిడీని, అసమానతలను పెంచి పోషించే సంస్కృతిని ముందుకు తెస్తున్న వారిని ఎన్నుకుంటున్నారు.

44. ఓబీసీలు ఓటు వేయకుండా ఏ ఒక్క పార్టీ కూడా గెలువలేదు. అంత బలమైన శక్తిగల ఓబీసీలు, ఓబీసీల ఓటు బ్యాంకు ఇతరులకు ఉపయోగపడుతున్నది. తమకు తాము ఓటు వేసుకోవాలి. గెలిపించుకోవాలి. అందుకు ఇప్పటికే రాజ్యాంగంద్వారా చట్టసభల్లో అవకాశాలున్న ఎస్సీ, ఎస్టీలతో కలిసి సాధించుకోవాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి నడవాల్సిన అవసరం ఉంది. అది కుల వివక్ష, మత వివక్ష, వర్ణ వివక్ష, అణచివేత, దోపిడి. ఇవి నిర్మూలించడానికి, తొలగించుకోవడానికి వీరందరు కలిసి రాజ్యాధికారంలోకి రావాలి. అదే డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆశయం. ఇండియన్ లేబర్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, డిప్రెస్డ్ క్లాసెస్ అసోసియేషన్, షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్ వంటి సంస్థల నిర్మాణం, పార్టీల నిర్మాణం ద్వారా అంబేద్కర్ ఇదే కోరుకున్నారు. ఇదే ఆచరించారు. అంబేద్కర్ వేసిన బాటలోనే ఓబీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుంది. కుల, మతాలను, వర్ణ వ్యవస్థను, అసమానతల సంస్కృతిని ఆచరించే పార్టీలలో గెలిచినప్పటికీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల అణచివేత తొలగిపోదు. పైగా అణిగిమణిగి ఉండి అణచివేతకే మౌనంగా మద్దతు ఇవ్వాల్సి వస్తుంది. 70 యేళ్ళుగా జరుగుతూ వస్తున్నది ఇదే.

45. భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా డా॥ బి.ఆర్. అంబేద్కర్

ఈ రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీకి డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఛైర్మన్‌గా గురుతర బాధ్యతను నిర్వహించారు. అధ్యక్ష స్థానంలో ఉండి సభ్యుల యొక్క అనేక సంశయాలను తీర్చారు. వ్యతిరేక దృక్పథాలను ఓపికతో వివరించి సానుకూలంగా

మార్చి ఒప్పించారు. రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఒప్పుకున్న మేరకు రాజ్యాంగంలో వాటన్నిటిని చేర్చడం జరిగింది. సభ్యుల ఉదార హృదయం కూడా అందుకు ఎంతగానో తోడ్పడింది. ఎన్ని పరిమితులున్నప్పటికీ భారత రాజ్యాంగం అంబేద్కర్ ఆశయాల, లక్ష్యాల అత్యున్నత ప్రతిబింబం స్టేట్స్ అండ్ మైనారిటీస్, భారతదేశంలో కులాల పుట్టుక, కుల నిర్మూలన మొదలైన వాటిలో అంబేద్కర్ తమ అభిప్రాయాలను సమగ్రంగా పొందుపరిచారు. అయినప్పటికీ భారత రాజ్యాంగం తక్కువేమీ కాదు.

46. రాజ్యాంగంలో భూమి సమస్య

ఎందుకు భూమి మీద వారి హక్కు రద్దు చేయలేదు? అంబేద్కర్ భూములను జాతీయం చేయాలన్నారు. చేయలేదు ఎందువల్ల? ఎందువలన అంటే మొత్తం జాతీయ ఉద్యమ చరిత్రను అధ్యయనం చేస్తే జాతీయ నాయకులంతా బ్రాహ్మణీయ, భూస్వామ్య సామాజిక వర్గాల నుండి వచ్చినవారు కావడమే.

అందువల్ల కేంద్రంలో రాష్ట్రంలో జిల్లాలు తాలూకా పరిపాలన మారినా గ్రామాల్లో ఇచ్చిన భూములు అధికారాలు మారలేదు పైగా వ్యక్తిగత ఆస్తిగా మారుస్తూ అనేక చట్టాలు వచ్చాయి. ఆనాటి భూములను దేవాలయ భూములను, అగ్రహారాలుగా ఇచ్చిన భూములను కూడా వ్యక్తిగత ఆస్తిగా మారుస్తూ చట్టాలు వచ్చాయి, భూములను కలిగి ఉండడం ప్రాథమిక హక్కులో భాగం చేశారు. ఆ హక్కును చట్టబద్ధ హక్కుగా మార్చినా మార్పేమి జరగలేదు. భూ సంస్కరణ పలు సీలింగు చట్టాలు ఆ భూములను మరింత చట్టబద్ధం చేశాయి.

దేశంలో మెజారిటీ ప్రజలకు కులం తప్ప మతమంటే తెలియదు. బడి చదువుల వల్ల మతం విస్తరించింది. ప్రజలు సంస్కృతిని ఆచరిస్తారు. చదువులు రాజకీయాలు దాన్ని మతమంటాయి. ఎవరు మీరు ? ఏమిటోల్లు అని అడిగితే కులం పేరు వృత్తి పేరు చెప్తారు. మతం పేరు చెప్పడం తక్కువ. మతం లేకుండా సంస్కృతి కొనసాగుతుంది. సంస్కృతి లేకుండా మతానికి ఉనికి లేదు. అందువల్ల సంస్కృతికి మతం రంగు వేస్తారు. మతాన్ని సంస్కృతిగా మార్చుతారు. సంస్కృతి అంటే జీవన విధానం. మానవీయ విలువలు

భారత రాజ్యాంగానికి మూడు ముఖ్య అంగాలు 1. చట్ట సభలు 2. పరిపాలన వ్యవస్థ, 3. న్యాయ వ్యవస్థ . ప్రస్తుతం చట్ట సభలలోనే ప్రజల ప్రాతినిధ్యం ఉంది.

మిగతా రెంటిలో కూడా ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ప్రజా ప్రాతినిధ్యం కలిగించినపుడే నిజమైన ప్రజా స్వామ్యం. అంతదాకా మన దేశంలో మూడింట ఒక వంతు మాత్రమే ప్రజాస్వామ్యం కొనసాగుతున్నది.

బీసీలు అభివృద్ధి చెందకుండా దేశం అభివృద్ధి చెందదు. బీసీలను కుల వృత్తుల నుండి ఆధునిక వృత్తులకు తరలించకుండా మధ్య తరగతి గా పరిపాలకులు గా విద్యావంతులుగా ఎదగడం సాధ్యం కాదు. ఎల్సీలది ఎస్సీలకు పోగా ఎస్టీలది ఎస్టీలకు పోగా అగ్రకులాలు ఆక్రమిస్తున్నది అనుభవిస్తున్నది బీసీల వాటాయే. రిజర్వేషన్లతో అన్నిరంగాల్లో సగటున 25 శాతం మాత్రమే. మిగతా 70-75 శాతాన్ని 15-30 శాతం ఉన్న అగ్ర కులాలు పొందుతున్నాయి.

రాజ్యాంగంలో అంబేద్కర్, గాంధీ, కాంగ్రెస్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. జనతా పార్టీ, మండల్ కమిషన్ జనతాదళ్ ద్వారా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. బిజెపి ద్వారా అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్లు కల్పించింది.

2

భారత రాజ్యాంగంలో చేర్చిన బీసీలకు సంబంధించిన అంశాలను పరిశీలిద్దాం. ఇవి బీసీ, ఎస్సీ, ఎస్టీలందరికి కూడా వర్తిస్తాయి. మహిళలకు కూడా వర్తిస్తాయి. ఇటీవల ఇడబ్ల్యుఎస్ ఆర్థిక వెనుకబడిన తరగతులకు కూడా ఈ ఆర్టికల్స్‌లో మార్పులు చేర్పులు చేయడం ద్వారా వర్తింపజేశారు. అందువల్ల భారత రాజ్యాంగంలో ఈ ఆర్టికల్స్ ఎంత ప్రధానమైనవో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

1. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14

చట్టం ముందు అందరూ సమానులే:

భారత భూభాగ పరిధిలో చట్టం ముందు అందరూ సమానులే. చట్టం నుండి ప్రజలందరికీ సమాన రక్షణ లభిస్తుంది. పౌరులకు గల ఈ హక్కును ప్రభుత్వం ఏ పౌరునికీ నిరాకరించరాదు. (State shall not deny to any person equality before law or the equal protection of laws with in the territory of India).

వివరణ: ప్రాథమిక హక్కులకు సంబంధించి 12, 13, 14, 15, 16, 19, 21, 31బి, 32, 340, 341, 342 46 ఆర్టికల్స్ 9వ షెడ్యూల్ అత్యంత ముఖ్యమైనవి. ఈ ఆర్టికల్స్ చట్ట సమానత్వానికి, సమాన హక్కులకు సంబంధించినవి. ఒక రకంగా ఈ ఆర్టికల్స్ పరస్పర పూరకాలు, అవిభాజ్యాలు, విద్యాలయాలలో రిజర్వేషన్లు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, వివిధ రకాల ఒప్పందాలు, కాంట్రాక్టులు, రాష్ట్రాల మధ్య వివక్షత, బొగ్గు క్షేత్రాలు, సహజ వనరుల కేటాయింపు, నదీ జలాల పంపిణీ తదితర అసంఖ్యాకమైన అంశాలు ఈ మూడు ఆర్టికల్స్ పరిధిలోకి వస్తాయి. శాసన దృష్టిలో సమానత్వం, శాసనాల ద్వారా సమానత్వ రక్షణ అనే రెండు విధాలుగా ఈ ఆర్టికల్స్ ప్రాధాన్యత సాధించుకున్నాయి.

అందువలన ప్రాథమిక హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించే చాలా తీర్పులలో ఈ మూడు ఆర్టికల్స్ ప్రస్తావన ఉంటుంది. 15(4), 16(4) ఆర్టికల్స్, 31బి, 32, 46 ఆర్టికల్, 9వ షెడ్యూల్‌లో చేర్చబడిన రిజర్వేషన్స్ ఆర్టికల్స్ అన్నీ నిజానికి ఆర్టికల్ 3, ఆర్టికల్ 4లో భాగంగా చేర్చబడాల్సినవి.

ఆర్టికల్ 2 మరియు 3లో రాష్ట్రాల ఏర్పాటు, సరిహద్దుల మార్పులు మొదలైనవి ఉన్నాయి. దేశమంటే, రాష్ట్రమంటే సరిహద్దులు అని ఈ ఆర్టికల్స్ ద్వారా అర్థం వస్తుంది. దేశమంటే మట్టికాదు, దేశమంటే మనుషులు. అందువల్ల ఆయా సామాజిక వర్గాలకు దేశ సరిహద్దుల వలె, రాష్ట్ర సరిహద్దులవలె, రాష్ట్ర సరిహద్దుల మార్పులు, చేర్పులవలె వీటి గురించి చేసే శాసనాలు, చట్టాలు రాజ్యాంగ సవరణలుగా భావించకూడదు. అవి రాజ్యాంగంలో భాగంగా భావించాలి. అప్పుడే దేశమంటే ప్రజలు అని పూర్తి అర్థం వస్తుంది.

అందువల్ల ఆయా సామాజిక వర్గాల పొందికలో, అసమానతలు, వివక్ష, అస్పృశ్యత మొదలైనవి తొలగించి అందరికి స్వేచ్ఛా, సమానత్వం, ఆత్మగౌరవం, అందరికి పని చేసే హక్కుతో సహా అన్ని రంగాల్లో ఎదిగే హక్కులు, చేపట్టాల్సిన ఆయా సామాజిక వర్గాలకు, వృత్తులకు, నైపుణ్యాలకు, దేశ, రాష్ట్ర సరిహద్దులవలె సరిహద్దులను, రక్షణలను కల్పించినట్లు అవుతుంది.

అప్పుడు 15(4), 16(4), 31బి, 32, 46వ ఆర్టికల్స్, 9వ షెడ్యూల్‌లో చేర్చిన రిజర్వేషన్ మొదలైన అంశాలు రాజ్యాంగ సవరణలుగా పరిగణించబడవు.

రాజ్యాంగంలో భాగమవుతాయి. అందుకు విశేషమైన అధ్యయనం, శాంతియుతంగా చర్చించే బీసీ, ఎస్సీ, ఎస్టీల మేధావులు, రాజ్యాంగ నిపుణులు, ఎదిగిరావాలి.

రాజ్యాంగంలోని 14, 15, 16, 17, 18, 19, 21, 32, 46, 340 ఆర్టికల్స్ చట్ట సమానత్వానికి, సమానత్వం సాధించడానికి సంబంధించినవి. చట్ట సమానత్వాన్ని రూల్ ఆఫ్ లా అంటారు. అంటే చట్టంముందు ఎవరూ అధికులు కారు. చట్టపరమైన అంశాలు అందరికీ సమానంగా ఉంటాయి. అయితే ఆర్థికంగాను, సామాజికంగా, భౌగోళికంగా, విద్యాపరంగా, దేహదారుఢ్య పరంగా, రాజకీయంగా అసమానతలున్న చారిత్రక పరిణామాల నుండి అనేక రాజ్యాలు, ప్రాంతాలు కలిసి విభిన్న పరిపాలనా వ్యవస్థలో ఉన్న దశ నుండి ఒకే ఒక రీతిలో ఉండే సామాజిక వ్యవస్థకు, భారత రాజ్యాంగ వ్యవస్థకు అనుసంధానం చేసి అందులో భాగం చేయబడ్డాయి. వికలాంగులు గుడ్డివాళ్ళు, పహిల్వాన్లు, బలవంతులు, స్త్రీలు, పురుషులు అందరూ కలిసి ఒకే గోదాలో కలిసి జీవించడం, పోట్లాడుకోవడం, గెలుచుకోవడం అనే పద్ధతి సరియైంది కాదు.

రాజ్యాంగంలో బలహీనులకు, వెనుకబడిన వర్గాలకు, షెడ్యూల్ కులాలకు, షెడ్యూల్ తెగలకు, మైనారిటీలకు, భాషా మైనారిటీలకు, బాలలకు, మహిళలలకు, ప్రత్యేక అవకాశాలు, రక్షణలు కల్పించ బడ్డాయి. వీటిని బలవంతులు ప్రతిభ పేరిట, మెరిట్ పేరిట వ్యతిరేకిస్తూ ఇవి స్వేచ్ఛా సమానత్వానికి, సమాన అవకాశాలకు భిన్నమైనవని వాదిస్తూ న్యాయస్థానాల్లో విజయాలు సాధిస్తున్నారు. న్యాయస్థానాల్లో ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులు కాకుండా, కొన్ని సామాజిక వర్గాల వారే ఉండడం వల్ల వారి దృష్టి కోణం కూడా వారికి అనుకూలంగా కొనసాగుతూ వచ్చింది.

సామాజిక న్యాయం అనేది బలవంతుల నుండి బలహీనులకు రక్షణ కల్పించడం కోసం. ఎదిగించడం కోసం, సమాన అవకాశాలు అందించడం కోసం. బుద్ధునికి పూర్వం నుండి గణతెగల, జనపదాల రాజ్యాల నుండి కూడా సామాజిక న్యాయం అనేది బలవంతులనుండి బలహీనులను, అశక్తులను, పిల్లలను, మహిళలను కాపాడి రక్షించడానికి వారికి అవకాశాలు కల్పించడానికి కృషి చేశారు. రాజును తండ్రి అని పిలవడం జరిగింది. అంటే రాజు ప్రజలకు తండ్రిగా అన్ని సమకూర్చి అందర్ని ఎదిగించే కృషి చేయాలని దాని భావన. అది ఒక గొప్ప ఆదర్శం. ఈ ఆదర్శం

ఆచరించేవారు ఆచరించారు. ఆచరించనివాళ్ళు మనుస్మృతిని, నారద స్మృతిని, వర్ణాధిక్య వ్యవస్థను, కుల వ్యవస్థ అంతరాలను తదనుగుణంగా శిక్షల్లో, అవకాశాల్లో వివక్షను, అంతరాలను కొనసాగించారు. వర్ణ, కుల వ్యవస్థలు నిరంతర వివక్షకు, అసమానతలకు గురి చేస్తూ వచ్చాయి.

బౌద్ధం అందరికి సమానత్వాన్ని ప్రబోధించింది. సమ్రాట్ అశోకుడు ప్రపంచంలో మొట్టమొదటిసారిగా భారత ఉపఖండంలో గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించడానికి బౌద్ధంలోని సమానత్వం, సమాన అవకాశాలు అనేవే ప్రాతిపదికగా పని చేశాయి.

మెరిట్ పేరిట, ప్రతిభ పేరిట అవకాశాలు ఇవ్వాలని కోరడం అనే కొత్త రూపంలో ఉన్నదేమిటి? బలవంతులు, శక్తివంతులు అన్ని అవకాశాలు తమకే ఉండాలని కోరడమే తప్ప వేరుకాదు.

శతాబ్దాలుగా సమస్త సంపదలను, ఉత్పత్తులను సృష్టించింది శూద్రులే. ప్రకృతి వనరులను, ఖనిజాలను, వెలికితీసి, కత్తులు, కటార్లు, నగలు, నాణేలు, కోటలు, దుర్గాలు, బట్టలు, పంటలు, ఇనుము, వెండి, బంగారం, ఇత్తడి, రాగి మొదలైనవన్నీ వెలికి తీసి నాణ్యమైనవిగా తయారు చేసి ఈ సమాజాన్ని సుసంపన్నం చేసింది శూద్రులే. శూద్రులు సృష్టించిన సంపద అపారమైనది.

సంపదను కొల్లగొట్టడానికి శతాబ్దాలుగా అనేక ప్రాంతాలనుండి భారత ఉ పఖండంలోకి దాడులు, దండయాత్రలు, వలసలు సాగాయి. తరతరాలుగా తరలించుకుపోయినా తరగని సంపద శూద్రులు సృష్టించారు. ఒక్క కేరళలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలోగల సంపద నేటికీ గమనిస్తే అది ఎంత గొప్ప సంపదో తెలుస్తుంది. అలా సోమనాథ దేవాలయం వంటి వందలాది దేవాలయాల్లో రాజుల ధనాగారాల్లో గుళ్ళు, గోపురాల నిర్మాణాల్లో, యుద్ధాల్లో తరలిన సంపద అంతా శూద్రుల సృష్టే. అందువల్ల ప్రతిభ, మెరిట్ ప్రాతిపదికగా తరతరాల నైపుణ్యాలకు వారసులైన ఆయా సామాజిక వర్గాలైన శూద్రులకు నేటి మొత్తం పారిశ్రామిక రంగం చెందాలి. అప్పుడు ప్రతిభ గురించి, మెరిట్ గురించి నిజమైన అర్థం ఏర్పడుతుంది.

2. ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు

ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే. జన్మనా జాయతే శూద్ర అని అంటారు. పుట్టుకతో అందరూ శూద్రులే. కుల వివక్షను భారత రాజ్యాంగం నిషేధించింది. అయినా సాహిత్యం, సంస్కృతి, పురాణ ఇతిహాసాలు, కళలు, సామెతలు, నుడికారాలు, భాష, వ్యాకరణ, రూపంలో కుల వివక్ష, కుల అంతరాలు ప్రచారం చేయబడుతున్నాయి. భారత రాజ్యాంగ ఆదర్శాలకు వ్యతిరేకంగా సాగుతున్న వీటిని ప్రజాస్వామికీకరించాల్సిన అవసరం ఉంది.

ఒక గిరిజనుడికి 20 వేల ర్యాంకుతో మెడిసిన్ సీటు వచ్చింది. 2 వేల ర్యాంకు వచ్చిన వారికి సీటు రాలేదు. దీన్ని ఏ కోణంలో చూడాలి? గిరిజనులు ఎంత వెనుకబడి ఉన్నారో, వారిలో నైపుణ్యాలను, విద్యను, విద్యా ప్రమాణాలను ఎంతగా పెంచాల్సి ఉందో అనే సానుకూల దృష్టితో ఆలోచించి, పథకాలు ప్రవేశపెట్టి, వారు కూడా రెండువేల లోపు ర్యాంకు దాకా చేరుకునేట్టు చేసినప్పుడే నిజంగా వారి అభివృద్ధి కోసం కృషి చేసినట్టు. ఇలా ఆలోచించకుండా నాకు రాలేదు. వారికి వచ్చింది అని విమర్శించడం వ్యక్తిగత స్వార్థంలో భాగం.

ప్రతి సామాజిక వర్గానికి, కులానికి ప్రాతినిధ్యం, అవకాశం జనాభా దామాషా మేరకు ప్రతిపాదించి అమలు జరిపితే అన్ని ప్రాంతాలకు, కులాలకు, వర్గాలకు సంబంధించిన వారికి అవకాశాలు అందుతాయి. తద్వారా ఆయా సామాజిక వర్గాల్లో, కులాల్లో ఒక స్ఫూర్తి, ఉత్తేజంతోపాటు వారి ప్రాతినిధ్యం పెరుగుతుంది. తద్వారా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో, ఆచరణలోకి వస్తుంది.

ముస్లింలు ఇండియాలోకి ప్రవేశించక ముందు దేశమంతటా అనేక మతాలు కొనసాగాయి. జైనం, బౌద్ధం, కాపాలికం, శాక్తేయం, శైవం, వైష్ణవం, అజీవకం మొదలైన వాటితోపాటు వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ బ్రాహ్మణీయ వ్యవస్థ మతాలుగా, రాజ్యాంగాలుగా, సంస్కృతిగా, పౌర, నేర, శిక్షాస్మృతులు కొనసాగుతూ వచ్చాయి.

వర్ణ, కుల వ్యవస్థ బాధితులు అణచివేయ బడినవారు ఇస్లాం స్వీకరించారు. కాలక్రమంలో క్రైస్తవ పాలకులు రావడంతో క్రైస్తవం స్వీకరించారు. అలా దేశంలో ఇస్లాం, క్రైస్తవం విస్తరించడానికి వర్ణ, కుల వ్యవస్థలను సమర్థిస్తూ సాగించిన

శిక్షాస్మృతులు, అణచివేతలు, అవమానాలు ప్రధాన కారణం. రాజుల మతాన్ని ప్రజలు స్వీకరించడం అశోకుని కాలం నుంచి కొనసాగుతున్నదే.

భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు, ఆశయాలు, మార్గదర్శకాలకు భిన్నంగా సమస్థ, వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, భాష, మత, వివక్షతలను ప్రేరేపించే, ఉద్దేశించే, వివక్ష, అస్పృశ్యత, కులాంతరాలు మొదలైనవాటిని సమర్థించే ప్రాచీన సాహిత్యం గానీ, సిద్ధాంతాలు గానీ, మతాలుగానీ, మత విశ్వాసాలు గానీ, భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యాలకు వ్యతిరేకమైనవి.

సంప్రదాయం, కళలు, సంగీతం, పురాణ ఇతిహాసాలు, మత బోధనలు, మత విశ్వాసాలు పేరిట భారత రాజ్యాంగ లక్ష్యాలకు వ్యతిరేకంగా నిత్యం బోధనలు, ప్రచారాలు సాహిత్య సృష్టి సాగుతూనే ఉన్నది. దీన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే.

వర్ణ కుల వ్యవస్థల అంతరాలు, వివక్షలు ఎట్టి పరిస్థితిలోనూ ప్రచారం చేయడానికి వీలులేదు అని బలంగా చెప్పినట్లవుతుంది. అందువల్ల ఇందుకోసం శాంతియుత పద్ధతుల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ లక్ష్యాలను, అందుకు వ్యతిరేకంగా ఉన్న విశ్వాసాలను గుర్తుచేసి తొలగించుకొని ప్రజాస్వామికంగా మారాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడం అవసరం.

అందుకు అనువుగా ఆయా విశ్వాసాల్లో, మతాల్లో, సంస్కరణలు కూడా అవసరమవుతాయి. అలాంటి సంస్కరణలు బుద్ధుడు, మహావీరుడు, అశోకుడు, కబీర్, గురునానక్ షిరిడీ సాయిబాబా, మహాత్మా జ్యోతిబా ఫూలే, డా॥ బి.ఆర్. అంబేద్కర్ దాకా ఎందరో సంస్కర్తలు ఎన్నో విషయాలను ప్రచారం చేశారు. వాటిని సమున్నతంగా ముందుకు తీసుకురావడం ద్వారా ప్రజలను అందరూ సమానమే అనే భావన స్థిరపర్చడం జరుగుతుంది. అందుకు వైజ్ఞానిక, శాస్త్రీయ అంశాలు, ప్రేమ, కరుణ, శాంతియుత సహజీవనం వంటివి ఎంతో ఉపయోగ పడతాయి.

3. భారత రాజ్యాంగం ఆర్టికల్ 15

ఆర్టికల్ 15 ద్వారా రాజ్యాంగం మత, జాతి, రేస్, కులం, లైంగికత లేదా

పుట్టిన ప్రదేశం పేరిట విచక్షణలను నిషేధిస్తుంది.

15. Prohibition of discrimination on grounds of religion, race, caste, sex or place of birth (మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా చూపే వివక్షత నిషేధించబడింది.)

1. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా రాజ్యం పౌరుల పట్ల వివక్షతను చూపరాదు.

2. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా ఏ పౌరుడూ ఏ విధమైన అనర్హతలకు, బాధ్యతలకు, ప్రతిబంధకములకు గురి చేయబడరాదు.

   ఎ) ప్రత్యేకంగా ప్రజలందరూ ఉపయోగించే షాపులు, హోటళ్ళు, విశ్రాంతి, వినోద గృహాలు స్థలాలు అనుభవించుటయందు

   బి) సర్వజనుల ఉపయోగార్థం అంకితమైన పాక్షికంగా కానీ, పూర్తిగా కానీ రాజ్య నిధులతో నిర్వహింపబడుతున్న బావులు, చెఱువులు, స్నానఘట్టాలు, రహ దారులు, విహారస్థలాలు వీటి అనుభవంలో ఏ వ్యక్తిని అభ్యంతర పరచరాదు.

3. అయినప్పటికీ ఈ ఆర్టికల్‌లోని అంశాలు ఏవీ స్త్రీలకు మరియు పసివారి సంక్షేమం కొరకు ప్రత్యేక రక్షణలను ఏర్పరుచుటయందు రాజ్యానికి ఉన్న అధికారానికి అడ్డురావు.

4. ఈ ఆర్టికల్‌లోని అంశములు ఏవీ మరియు ఆర్టికల్ 29 క్లాజ్ (2)లోని అంశములు షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికి మరియు సాంఘికంగాను విద్యలోను వెనుకబడిన ఇతర తరగతుల వారికి ప్రత్యేక రక్షణలను ఏర్పర్చటానికి రాజ్యానికి ఉన్న అధికారానికి అడ్డురావు.

5. పైన ఉదహరించిన అంశాలు ఏవీ షెడ్యూల్ కులాల వారికి, షెడ్యూల్డ్ తరగతుల వారికి, మరియు వెనుకబడిన తరగతుల వారికి విద్యావకాశాలలో కల్పించు రక్షణలను ప్రైవేట్ విద్యా సంస్థలలో, అవి ప్రభుత్వం చేత సహాయం పొందుతున్న లేక పొందనివైనా, ఏర్పరచుటయందు రాజ్యానికి ఉన్న అధికారానికి అడ్డురావు. అయితే, ఈ అధికారం అల్ప సంఖ్యాక వర్గాలు ఏర్పరచుకొను సంస్థలకు వర్తించదు.

వివరణ: 15 ఆర్టికల్‌లోని 4వ పాయింట్ (15.4) అనుసరించి బీసీలకు రిజర్వేషన్లు, ప్రత్యేక పథకాలు మొదలైన వాటికి రక్షణ కల్పించడం జరిగింది. (15.4ఎ) అనుసరించి ఎస్సీలకు, ఎస్టీలకు ఉద్యోగాల్లో ప్రమోషన్లు కూడా రిజర్వేషన్లు ప్రవేశపెట్టడం జరిగింది. ఆర్టికల్ 46 ఇందుకు ప్రాతిపదికనిచ్చింది. తమిళనాడు ఉద్యమాల వల్ల ఒకటవ రాజ్యాంగ సవరణతో 15.4, 16.4 ఆర్టికల్స్ చేర్చబడ్డాయి.

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి 15.4, 16.4 ఆర్టికల్స్ చారిత్రక ప్రాధాన్యత:

మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 15.4, 16.4 ఆర్టికల్ క్లాజ్, చేర్చడంలో 9వ షెడ్యూల్‌లో 76వ రాజ్యాంగ వసరణ ద్వారా చేర్చడంలో తమిళనాడు రిజర్వేషన్ ఉద్యమాలు ద్రవిడకజగం, డిఎంకే, అన్నాడిఎంకే, దక్షిణాది రాష్ట్రాల ఉద్యమాల ప్రభావం ఎంతో ఉంది. ముఖ్యంగా జస్టిస్ పార్టీ, అదే ఆ తర్వాత పేరు మార్చుకుని ద్రవిడ కజగంగా కొనసాగిన ఉద్యమానికి పెరియార్ రామస్వామి నాయకర్ నాయకత్వం అందించారు. అలా రిజర్వేషన్లను న్యాయస్థానం ద్వారా అడ్డుకోకుండా చేయడంలో పెరియార్ రామస్వామి నాయకత్వంలో సాగిన ఉద్యమాలతో 15.4, 16.4 ఆర్టికల్స్ చేర్చారు. 1951లో చెంపకం దొరై రాజన్ మెడికల్ సీట్లలో రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ వేసిన కేసులో మద్రాసు హైకోర్టు రిజర్వేషన్లు ప్రాథమిక హక్కులకు భిన్నమని రిజర్వేషన్లను కొట్టివేయడం జరిగింది. దాంతో ఉద్యమాలు పెల్లుబికాయి. మొదటి రాజ్యాంగ సవరణతో 15.4, 16.4 ఆర్టికల్స్ చేర్చడం జరిగింది.

ఇలా భారత రాజ్యాంగంలో అంబేద్కర్ న్యాయశాఖా మంత్రిగా రిజర్వేషన్ల రక్షణ కోసం పకడ్బందీగా అమలు జరపడానికి తమిళనాడు ఉద్యమాలు, పెరియార్ రామస్వామి నాయకుల కృషి మరువలేనిది. ఆ తర్వాత రాంమనోహర్ లోహియా, బి.పి. మండల్‌ల కృషి ముందుకు సాగింది.

ప్రభుత్వ విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు సరిగ్గా అమలు జరిగితే సుప్రీంకోర్టు పరిమితిలో పేర్కొన్నట్టు కనీసం 50 శాతం మేరకు రిజర్వేషన్ల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో ఉండాలి. దీనికి అదనంగా జనరల్ కేటగిరిలో ఎన్నికైన బీసీ, ఎస్సీ, ఎస్టీల నుండి కనీసం 6 శాతం ఎంపికైనా

మొత్తం 56-60 శాతం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలనుండి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, ప్రభుత్వ సంస్థల్లో ఈ మేరకు బ్యాక్‌లాగ్ పోస్టులు, సూపర్ న్యూమరీగా సృష్టించి నింపడం అవసరం. రిటైరైన పోస్టులను అనుసరించి వాటిని క్రమబద్ధీకరించవచ్చు. ప్రయివేటు రంగంలో కూడా రిజర్వేషన్లను తప్పనిసరి అందుకోవడానికి మూడు మార్గాలు.

15(4) ఆర్టికల్ వంటి వాటి ద్వారా కేంద్రంలో, రాష్ట్రాల్లో ప్రత్యేక ఓబీసీ శాఖల ద్వారా విద్యాసంస్థలు నిర్వహించడం ద్వారా 10-12 ఏళ్ళలో వారు ఇతరులతో సమానంగా ఓపెన్ కాంపిటిషన్‌లో కూడా గెలుస్తూ వస్తారు. ఆర్టికల్ 43 అనుసరించి మంచి జీవన ప్రమాణాలకు, ఇలాంటి ఎన్నో అమల్లోకి తేవల్సి ఉంది. భారత రాజ్యాంగంలోని 4వ భాగం రాజ్య విధానపు ఆదర్శ సూత్రాలు కూడా ఇందుకు అనుకూలంగా అన్వయించడం అవసరం. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు పరస్పర అనుపూర్వకాలుగా ప్రకటించింది. ఆదేశిక సూత్రాలు లక్ష్యాలను నిర్ణయించగా, ప్రాథమిక హక్కులు ఆ లక్ష్య సాధనకు మార్గాలుగా వర్ణించింది. అందువల్ల ఆదేశిక సూత్రాలకు భిన్నంగా ప్రాథమిక హక్కుల పేరిట వ్యాజ్యాలు వేసినప్పుడు ఆదేశిక సూత్రాలు అనుసరించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుంది.

వర్తమాన కర్తవ్యాలు

15వ ఆర్టికల్ ద్వారా సామాజిక, వర్ణ, కుల, ప్రాంత, భాష, లింగ ప్రాతిపదికలపై అసమానతలను తొలగించి సమానత్వాన్ని ప్రతిపాదిస్తుంది. ప్రతి మనిషికీ ఒకే విలువ, ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. మనుషులంతా ఒక్కటే అనే మానవీయ సమాజ నిర్మాణం భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యం. అందుకు ఆర్టికల్ 13, 14, 15, 16, 17, 23, 31బి, 32, 368 ఆర్టికల్స్ రక్షణ కల్పిస్తాయి. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం, అందరికీ సమాన అవకాశాలు, సమాన అవకాశాలను అందుకోలేకపోతున్నవారికి ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీల, స్కాలర్‌షిప్‌లు, విశ్వవిద్యాలయాలు, శిక్షణలు, రక్షణలు, రిజర్వేషన్లు మొదలైనవి ఏర్పాటు చేయబడ్డాయి. ఇవన్నీ ఈ ఆర్టికల్స్‌లో పొందుపర్చబడ్డాయి. అందువల్ల 13, 14, 15, 16, 17, 23, 31బి, 368, 9వ షెడ్యూల్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, బలహీన వర్గాలకు అత్యంత ముఖ్యమైనవి.

4. భారత రాజ్యాంగం ఆర్టికల్ 16

ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో సమానావకాశాలు

1. ఆర్టికల్ 16 ద్వారా పబ్లిక్ ఎంప్లాయిమెంట్ అవకాశాల్లో సమాన అవకాశాలను కల్పిస్తుంది.
   1) There shall be equality of opportunity for all citizens in matters relating to employment or appointment to any office under the State.
   2) No citizen shall, on grounds only of religion, race, caste, sex, descent, place of birth, residence or any of them, be ineligible for, or discriminated against in respect of, any employment or office under the State.

1. రాజ్యంలోని అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రభుత్వ ఉద్యోగ వసతుల్లో పౌరులందరికీ ఈ సమానావకాశాలు ఉండాలి.

2. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానాలలో అన్నింటిని గాని లేక ఏ ఒక్కటిని గాని కారణంగా, ఉద్దేశించి ప్రభుత్వోద్యోగ అర్హతలలోనూ, ప్రభుత్వోద్యోగముల లోనూ చేర్చుకొనుటలోనూ పౌరులమధ్య వివక్షత చూపరాదు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు

వివరణ: బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడే ఆయా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ ఉద్యోగాల్లో 50 శాతం మేరకు గల రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలు జరుగుతాయి.

3. అయినా జన్మస్థానాన్ని బట్టి రాష్ట్ర మరియు కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వోద్యోగాలలోని స్థానిక సంస్థలలోని మరియు స్వాధికార సంస్థలలోని ఉద్యోగాలను స్థానికులకు కేటాయించు విధంగా చట్టాలు చేయు అధికారం పార్లమెంటుకు ఉన్నది. ఈ కేటాయింపు ఏదైనా ఒక తరగతికి లేక కొన్ని తరగతుల ఉద్యోగాలకు పరిమితమయి వుండాలి. ఈ కేటాయింపు ఉద్యోగుల నియామకం కంటే ముందు నిర్ణయించబడినవై ఉండాలి.

ఆర్టికల్ 16(4) ప్రాధాన్యత

4. అయినప్పటికీ, వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో, అవకాశాలలో ప్రత్యేక కేటాయింపులను ఏర్పరచు అధికారం రాజ్యానికి ఉంది. వెనుకబడిన తరగతుల వారు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగినంతమంది లేనట్లు రాజ్యం అభిప్రాయ పడినపుడు మాత్రమే తదుచితమైన కేటాయింపులను చేయవచ్చు.

4ఎ. అయినప్పటికీ, షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులములకు చెందిన వారికి ప్రభుత్వోద్యోగాల్లో ప్రమోషన్‌లలో కూడా ప్రత్యేక కేటాయింపులను ఏర్పరచు అధికారం రాజ్యానికి ఉంది. ఉన్నత పదవులలో వారికి సీనియారిటి ప్రసాదించు అధికారము కూడా రాజ్యానికి ఉంది. షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల వారు తగినంత మంది ప్రభుత్వోద్యోగాల్లో లేనట్లు రాజ్యం అభిప్రాయపడినచో తదుచితమైన పదోన్నతులకు అనువైన కేటాయింపులను చేయవచ్చు.

4బి. పైన ఉదహరించిన 4, 4(ఎ)లను అనుసరించి ప్రత్యేకంగా కేటాయించిన స్థానాలు ఏ సంవత్సరములోనైనా భర్తీ కానిచో వాటిని తదుపరి సంవత్సరాల్లో భర్తీ చేయవచ్చు. అట్టి స్థానాల్లో ఏ సంవత్సరములోనైనా భర్తీ చేయవలసిన స్థానాలు కలిపి రిజర్వేషన్ అయ్యే స్థానాలు 50 శాతంకు మించితే ఆ విధంగా పరిగణించుటకు వీలులేదు.

5. అయినప్పటికీ, మతపరమైన సంస్థల నిర్వహణ కొరకు నియమితమయ్యే ఉద్యోగులూ యాజమాన్య హోదాలో ఉండు వారందరూ అదే మతమునకు చెందిన వారై ఉండ వలెననుటకు అభ్యంతరము ఉండరాదు.

(ఈ ఆర్టికల్, లేదా 19వ ఆర్టికల్‌లోని క్లాజు (1) లోని సబ్ క్లాజు (జి)లో ఏమి పేర్కొనబడినప్పటికి, సామాజికంగా మరియు విద్యా పరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరుల అభ్యున్నతి కోసం వారు (for the advancement of any socially and educationally backward classes of citizens) లేక షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల వారి అభ్యున్నతి కోసం ప్రయివేటు విద్యా సంస్థలతో సహా అన్ని విద్యా సంస్థలలో వారి ప్రవేశానికి సంబంధించి చట్ట పూర్వకంగా ప్రత్యేకమైన నిబంధనలను ప్రభుత్వం జారీ చేయవచ్చు. (సదరు విద్యా

సంస్థ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందుతున్నా, పొందక పోయినా, ఈ నియమం వర్తిస్తుంది). అయితే, 30వ అధికరణంలో ఉదహరింపబడిన అల్ప సంఖ్యాకుల విద్యా సంస్థలకు ఈ క్లాజు వర్తించదు. (ఈ క్లాజు 93వ రాజ్యాంగ సవరణ ద్వారా 2005లో అదనంగా చేర్చబడింది).

రాజ్యాంగం మొదటి సవరణ ద్వారా 15వ ఆర్టికల్‌కు (4) క్లాజు అదనంగా చేర్చబడింది. అలా విద్యారంగంలో రిజర్వేషన్లకు రక్షణ కల్పించడం జరిగింది. మండల కమిషన్ సిఫారసులను అనుసరించి న్యాయస్థానాల తీర్పుల తదనంతరం కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో వెనుకబడిన తరగతుల వారికి 27 శాతం కోటాను రిజర్వేషన్లు కల్పిస్తూ, 2007లో కేంద్ర ప్రభుత్వం యాక్ట్ నెం. 5/2007ను తెచ్చింది. ఆ చట్టంలోని సెక్షన్ 3లో వెనుకబడిన తరగతు లను సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరులుగా కేంద్ర ప్రభుత్వం చేత గుర్తించబడినవారు అని పేర్కొనడం జరిగింది. రిజర్వేషన్ల కోటాను 69 శాతానికి పెంచుతూ తమిళనాడు ప్రభుత్వం ఒక చట్టాన్ని తెచ్చింది. ఆ చట్టం పేరు తమిళనాడు వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (విద్యాసంస్థల్లో, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు) చట్టం 1993.

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ చట్టానికి రక్షణ కల్పించడానికి, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకుండా చూడడానికి 9వ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది. ఈ శాసనాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి 76వ రాజ్యాంగ సవరణ జరిగింది. వీటన్నిటికి ఆర్టికల్ 46 ప్రాతిపదిక. ప్రాథమిక హక్కుల ఆర్టికల్స్ కన్నా 46వ ఆర్టికల్ అధిక ప్రాధాన్యత గల ప్రాథమిక హక్కులకు సంబంధించినది.

5. బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కులు, రిజర్వేషన్ల గురించి పట్టించుకోలేకపోయిన సామాజిక ఉద్యమాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు

సామాజిక, ఆర్థిక, భావజాల, సాంస్కృతిక, సాహిత్య ఉద్యమ కర్తవ్యాల్లో భాగంగా 1990 నుండి దేశ వ్యాప్తంగా ప్రసంగాలు, పర్యటనలు, సంస్థల నిర్మాణాలు, కార్యక్రమాలు చేపట్టినప్పుడు అనేక అవరోధాలు, విమర్శలు ఎదురైనప్పుడు ఆయా సంఘాలను, ఉద్యమాలను, సంస్థలను, వ్యక్తులను చాలా సూటిగా ప్రశ్నించాను. మీరు గత దశాబ్దాల్లో ఉపాధ్యాయ సంఘాలుగా ఎస్సీలు గ్రామీణ ప్రాంతాల్లో ఉ

పాధ్యాయులుగా పని చేస్తున్నప్పుడు ఎదుర్కొనే కుల వివక్ష గురించి, వాళ్ళకు ఇళ్ళు కిరాయికి దొరకక పోవడం గురించి, అందువల్ల వారికోసం ప్రత్యేకంగా క్వార్టర్స్ కట్టించాలని గానీ, స్థానికంగా లేకపోయినా, ఫర్వాలేదు అని గానీ, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన డిమాండ్లు, అలాగే ఉద్యోగసంఘాలను, పౌరహక్కుల సంఘాలను, మానవ హక్కుల సంఘాలను, ప్రజాస్వామిక హక్కుల సంఘాలను, ఉద్యమ సంఘాలను, పార్టీలను ప్రశ్నించాను. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను, బ్యాక్‌లాగ్ పోస్టులను నింపాలని, ఆధునిక విద్య, ప్రభుత్వ ఉద్యోగం, భారత రాజ్యాంగ ఆర్టికల్ 21లో పేర్కొన్న జీవించే హక్కు అని, అలా జీవించే హక్కులకు సంబంధించిన ఆర్టికల్స్ పేర్కొంటూ, వాటిని సమర్థిస్తూ రిజర్వేషన్ కోటా నింపడానికి ప్రత్యేక కృషి, ఉద్యమాలు కనపడవు. వాటికోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు, కుల సంఘాలు, పార్టీలు మాత్రమే ఉద్యమిస్తూ వస్తున్నారు.

6. ఆర్టికల్ 32 ప్రాథమిక హక్కుల పరిరక్షణ మార్గాలు:

1) రాజ్యాంగంలోని ఈ విభాగం ద్వారా ప్రజలకు సంక్రమింప జేయబడిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, సమయోచితమైన రీతిలో సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. రాజ్యాంగం ఈ మేరకు హామీ ఇస్తుంది.

2) ప్రాథమిక హక్కులను అమలు చేయుటకు సంబంధించి సమయోచితమైన ఉత్తర్వులను జారీ చేయు అధికారం సుప్రీం కోర్టుకు ఉంటుంది. సుప్రీం కోర్టు ఆ క్రమంలో ఆదేశాలనుగాని, ఉత్తర్వులనుగాని, లేక హెబియస్ కార్పస్, మాండమస్, కో–వారంటో, సర్షియోరరి, ప్రొహిబిషన్ వంటి రిట్ ఆదేశాలను గాని జారీ చేయవచ్చు.

3) ఈ ఆర్టికల్స్‌లోని (1) మరియు (2) క్లాజులలో ఏమి పేర్కొనబడినప్పటికి, క్లాజు (2) క్రింద సుప్రీం కోర్టుకు గల అధికారాలను మరేదైనా హైకోర్టుకు కూడా సంక్రమింపచేస్తూ శాసనము చేయు అధికారం పార్లమెంటుకు కలదు.

4) ఈ రాజ్యాంగంలో సూచించబడిన విధంగా తప్ప, మరొక విధంగా ఈ ఆర్టికల్‌లో ప్రాథమిక హక్కుల పరిరక్షణా హక్కును తీసివేయరాదు.

ఆర్టికల్ 32ఎ: శాసనాల రాజ్యాంగ బద్ధతను 32వ ఆర్టికల్ క్రింద ప్రశ్నించరాదు.

32వ ఆర్టికల్ యొక్క పరిధిని, ప్రభావాన్ని కుదించేందుకు ఉద్దేశింపబడిన ఈ ఆర్టికల్ శ్రీమతి ఇందిరాగాంధీ పరిపాలనా కాలంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో చేర్చబడింది. జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 1978లో జరిగిన 43వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ఆర్టికల్ తొలగించబడింది.

7. భారత రాజ్యాంగం ఆర్టికల్ 340

వెనుకబడిన తరగతుల స్థితిగతులను విచారించే నిమిత్తం కమిషన్ నియామకం

1. భారతదేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారి స్థితిగతులను అధ్యయనం చేయడానికి వారికున్న ఇబ్బందులను, అనుభవిస్తున్న కష్టాలను తెలుసుకోవడానికి, విచారణ చేయడానికి, వారి అభివృద్ధికి కేంద్రం లేక రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను, చేపట్టాల్సిన కార్యక్రమాలను సూచించిన నిమిత్తం ఒక జాతీయ కమిషన్‌ను రాష్ట్రపతి నియమించవచ్చు.

   యూనియన్ మరియు రాష్ట్రాల చేపట్టవలసిన చర్యలను సూచించే నిమిత్తం మరియు యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల వారి పురోగతిని, అందించవలసిన గ్రాంట్లను, వాటి మంజూరుకు అవసరమయిన షరతులను సూచించే నిమిత్తం, రాష్ట్రపతి తనకు సమర్థులని నమ్మకం ఉన్న వ్యక్తులను కమిషన్‌గా నియమించాలి. ఆ నియామక ఉత్తర్వులో కమిషన్ అనుసరించవలసిన కార్యక్రమ నియమావళిని నిర్ణయించవచ్చు.

2. కమిషన్ తమకు అప్పగించిన విషయాలపై దర్యాప్తు జరిపి కనుగొనిన వాస్తవాలను, జస్టిఫికేషన్ చూపుతూ తాము ఉచితమని భావించిన సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్రపతికి సమర్పించాలి.

3. కమిషన్ సమర్పించిన రిపోర్టు నకలును కమిషన్ సూచించిన సిఫార్సులపై తీసుకొన్న చర్యల వివరణల మెమోరాండమ్‌తో సహా రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయ సభల ముందు ప్రవేశపెట్టే ఏర్పాట్లు చేయాలి.

వివరణ: ఆర్టికల్ 340 ద్వారా ఇతర వెనకబడిన తరగతుల (ఓబీసీ) స్థితిగతుల గురించి పరిశీలించే కమీషన్ ఏర్పరచబడింది. దీనిని అనుసరించి నెహ్రూ కాలంలో కాకా కాలేల్కర్ ఛైర్మన్‌గా బి.సి. కమిషన్ ఏర్పాటు చేయబడింది. అది సాదించింది ఏమీ లేదు. ఆ రిపోర్టును మూలకు పడేశారు. రిజర్వేషన్లు 1932 నుంచి పూనా ఒప్పందంతో రావలసినవి, కాకా కాలేల్కర్ కమిషన్‌తోనైనా అమలులోకి వస్తాయను కున్నవి నెహ్రూ మంత్రి వర్గంచేత నిరాకరించబడ్డాయి. ఆ తర్వాత 25 ఏళ్ళకు మండల్ కమిషన్ ఏర్పాటు చేయబడింది. వెనుకబడిన వర్గాలు అంటే ఎవరో ఆర్టికల్ మరొకసారి నిర్వచించింది. సామాజికంగాను, విద్యా విషయంగానూ వెనుకబడి ఉన్నవారు ఈ ఆర్టికల్ క్రింద వెనుకబడి వర్గాలవారవుతారు. పారిశ్రామిక వ్యవస్థ, ఆధునిక పరిపాలనా వ్యవస్థ, ఆధునిక విద్య, ఆవశ్యకతను అనివార్యం చేయడంతో వెనుకబాటు తనానికి నెట్టివేయబడిన పరిణామాలతో పాటు కులవ్యవస్థ విధించిన పరిమితులు, వివక్ష సామాజిక వెనుకబాటుతనం, విద్యా విషయంగా వెనుకబాటు తనం అనేవి అవిభాజ్యాలు. ఈ చరిత్రను అధ్యయనం చేయకపోతే ఎవరో తీసిన గోతిలో పడక తప్పదు.

8. తులనాత్మకత నిర్వచనం:

రాజ్యాంగంలో సోషల్లీ ఎడ్యుకేషనల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎస్ ఈ బీ సీ) (సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు) అని ఓ బీ సీ అని సమార్థకాలుగా వాడారు. సామాజికంగా విద్యాపరంగా వీరు వెనక బడిన వారైతే మరి చరిత్ర పొడువునా శతాబ్దాలుగా సంపదలను ఎవరు సృష్టించారు? అంటరానివారు సమాంతర సమాజంగా కొనసాగుతుంటే సమాజంలో అంతర్భాగమైన శూద్రులు అని పిలువ బడినవారి నైపుణ్యాలు సాంకేతికత, విద్య, కళలు, శాస్త్రాలు విద్య కాదని నిరాకరించడం ద్వారానే ఓబీసీ అనే నిర్వచనం, వర్గీకరణ జరిగింది. ఈ పద సృష్టిలోనే అణచివేత, కించపరచడం ఉంది అని భావిస్తున్నారు.

9. సాధించిన హక్కులను పొందాలన్నా ఉద్యమాలు అవసరం

రాజ్యాంగంలో పొందుపర్చుకోవడం ఒక ఎత్తు. వాటిని ఆచరణలోకి తెచ్చుకోవడం మరో ఎత్తు. అందుకు ప్రజలు, సామాజిక వర్గాలు ఉద్యమాలు చేయాల్సి ఉ

ంటుంది. వ్యతిరేక శక్తులతో సంఘర్షించాల్సి ఉంటుంది. ఏ సంఘర్షణ లేకుండా, ఏ మార్పు జరగదు. సంఘర్షణ సైద్ధాంతికంగా చేయాలి. సంఖ్యాబలంతో ఉదాత్తమైన నినాదాలు ఇవ్వాలి. తాత్విక పునాది ఏర్పర్చాలి. భారత రాజ్యాంగం 17వ ఆర్టికల్ ద్వారా అంటరానితనం నిషేధించబడింది. అయినా నేటికీ ఆచరిస్తూనే ఉన్నారు. దీనికి వ్యతిరేకంగా ఆయా సామాజిక వర్గాలతో, అమానవీయ సంస్కృతితో దానికి మద్దతు ఇస్తున్న మనుస్మృతికి వ్యతిరేకంగా, వర్ణ కుల, ఆధిపత్యవాదులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సి ఉంటుంది.

అలాగే బాల కార్మిక వ్యవస్థ నిషేధించబడింది. స్త్రీల వివక్ష నిషేధించబడింది. కుల వివక్ష నిషేధించబడింది. అయినప్పటికీ సమాజంలో కొనసాగుతున్నాయి. అంటరానితనం పాటించడం నేరం అని 1950లో రాజ్యాంగంలో చేర్చుకున్నప్పటికీ, అది ఆచరణలోకి రావడానికి అనేక ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. అలా అనేక ఉద్యమాల అనంతరం1989లో అంటరానితనం నేరమని, అందుకు శిక్షలు ఉ ంటాయని, అత్యాచార నిరోధక చట్టంతో నాన్ బెయిలబుల్ శిక్షార్హమైన నేరంగా ఉ నికిలోకి వచ్చింది. ఇలా రాజ్యాంగంలో ఒక అంగీకారానికి వచ్చి ఆర్టికల్స్‌లో చేర్చిన తర్వాత వాటిని ఆచరణలోకి తెచ్చుకోవాడానికి ప్రతి అంశంపై ఉద్యమాలు చేయాల్సి ఉంటుంది. పౌరహక్కుల ఉద్యమాలు, మానవ హక్కుల ఉద్యమాలు, మహిళా హక్కుల ఉద్యమాలు, బాలల హక్కుల ఉద్యమాలు, కార్మికుల ఉద్యమాలు, ప్రత్యేక రాష్ట్ర ఉ ద్యమాలు మొదలైనవి రాజ్యాంగంలో పొందుపర్చుకున్న హక్కులు, రక్షణలు ఆర్టికల్స్ పరిధిలో చేసే అవకాశం కలిగింది. అలా అంబేద్కర్ ఎన్నో కార్మిక చట్టాలు, మహిళా చట్టాలు, మానవ హక్కుల చట్టాలు రూపొందించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కమిషన్‌లు, మహిళా కమిషన్‌లు జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో ఏర్పాటు చేసుకోవడానికి రాజ్యాంగంలోని 338, 339, 340 తదితర ఆర్టికల్స్ చేర్చబడ్డాయి. వాటి నివేదికలు అనుసరించి ప్రభుత్వాలు చట్టాలు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఓబీసీలు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగబద్దంగా ఎస్సీలను కలుపుకొని ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ఓబీసీలకు ఆ ప్రక్రియలో మహాత్మా జ్యోతిబా ఫూలే, సాహు మహరాజ్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ గార్ల కృషి ఎంతో స్ఫూర్తినిస్తుంది.

52 శాతం జనాభా ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో 50 శాతం ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు లేకపోవడం, సైమన్ కమిషన్ మొదలుకొని, 1935 రాజ్యాంగం, 1947 రాజ్యాంగం, వాటిగురించి చర్చించకపోవడం, చేర్చకపోవడం, విచారకరం. ఓబీసీలకు, మహిళలకు చట్టసభల్లో దామాషా మేరకు ప్రాతినిధ్యం, రక్షణ, రిజర్వేషన్లు లేకపోవడం నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకోదు. వీరు పాలితులుగా నేటికీ కొనసాగడం అగ్రవర్ణాల, అగ్రకులాల ఆధిపత్యాన్ని, బీసీల, మహిళల బలహీనతలను తెలియజేస్తుంది. బడికి పోను అని పిల్లలు ఏడిస్తే ఒప్పించి, మెప్పించి బడికి పంపడం బాధ్యత. మేము బానిసత్వంలోనే ఉంటామని, కులవృత్తుల్లో, కులబానిసత్వంలోనే ఉంటామని బీసీ, ఎస్సీ, ఎస్టీలు భావిస్తే వారిని ఒప్పించి, మెప్పించి ఆధునిక సమాన హక్కులు అందించి ప్రోత్సహించడం ఎదిగినవారి బాధ్యత. అందరికీ సమాన హక్కులు భారత రాజ్యాంగం ఇలానే కల్పించింది. స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వస్తున్న ఆధిపత్య కులాలు, సామాజిక వర్గాలవారు ఇలాగే ఓబీసీలకు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండింది. ఆ పని చేయలేదు.

మారాల్సింది నువ్వయినపుడు అవతలి వారిని మారాలని మార్చాలని ప్రయత్నిస్తే ఫలమేమి? మారాల్సింది అవతలివారైనుపుడు నిన్ను నీవు ఎన్నిసార్లు తిట్టుకున్నా, మార్చుకున్నా ఉపయోగమేమి? మారాల్సింది సమాజమైనపుడు నిన్ను నీవు ఎంత మార్చుకున్నా ఒరిగేది ఏమిటి? జరిగేది ఏమిటి? మారాల్సింది ప్రభుత్వ విధానాలు, రాజకీయాలు అయినపుడు మనం మనం నువ్వంటే నువ్వు అని తన్నుకోవడం, తిట్టుకోవడంతో వచ్చేదేమిటి? సమాజంలో వచ్చే మార్పేమిటి? నువ్వు సమాజం కోసం పని చేయకుండా సమాజం మారాలని కోరితే నీవల్ల సమాజానికి ఒరిగేదేమిటి? నువ్వు మారాలి. అవతలి వారిని మార్చాలి. నలుగురు కలిసి సమాజాన్ని మార్చాలి. సంఘటిత శక్తిగా ఎదగాలి. సంఘ సంస్కరణ జరగాలి. వ్యక్తిగతంగా కాకుండా సమాజం గురించి ఆలోచించాలి. అసమానతలు వివక్షలు ఆధిపత్యాలు తొలగించే కృషి చేయాలి.

కదిలిస్తే సమాజం కదులుతుంది. కరిగిస్తే హృదయం కరిగిపోతుంది. అతికిస్తే పగిలిన ఎముకలు అతుక్కుంటాయి. కరిగిస్తే చెదిరిన విరిగిన హృదయాలు మునుపటి కన్నా బలంగా పెనవేసుకుంటాయి.ఒప్పిస్తే బలమైన శత్రువులైనా మిత్రులవుతారు.అంగుళి మాలుడిలా... సౌలు పౌలు గా మారినట్టు గా! ఓపికతో

వివరిస్తే ఆస్తికులంతా హేతువాదులవుతారు. బుద్ధుడు కదిలించాడు. సమాజం కదిలింది. భక్త కబీర్, రవిదాస్ కదిలించారు. సమాజం కదలబారింది. జ్యోతిరావు ఫూలే సమాజాన్ని కదిలించాడు సమాజం కదిలింది. సావిత్రి బాయి ఫూలే కదిలింది సమాజం కదలబారింది. అంబేద్కర్ సమాజాన్ని కదిలించాడు. సమాజం తోపాటు రాజ్యమే కదిలింది. అంబేద్కర్ రాజ్యాంగమై నిలిచాడు.

ఇప్పటికీ ఆధునిక ఉన్నత విద్య ముప్పై శాతం ప్రజలకే అందుతున్నది. ఆధునిక విద్య అందుకోకుండా, ఆధునిక అభివృద్ధి సాధ్యం కాదు. అంబేద్కర్ లక్ష్యం పరిపూర్తి కాదు. కులవృత్తుల నుండి బయటపడి ఆధునిక అభివృద్ధిలో భాగస్వామి కావడానికి ఆధునిక విద్య అనివార్యం. అందువల్ల కేజి టు పీజి ఉచిత రెసిడెన్షియల్ విద్య దేశవ్యాప్తంగా అందరికీ 16 యేళ్ళ పాటు ఉన్నత ప్రమాణాలతో అందించి నూరు శాతం విద్యావంతులయ్యే విధంగా కృషి చేసినప్పుడే అంబేద్కర్ లక్ష్యం నెరవేరుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఇందుకు భారతదేశంలో అందరికన్నా ముందుగా ఒక ముందడుగు వేసింది. రాష్ట్రం ఏర్పడక ముందు 30 రెసిడెన్షియల్ స్కూళ్ళు ఉంటే ఇప్పుడది 950కి పైగా అయ్యాయి. రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీలలో ఐదు లక్షలమంది బాలబాలికలు ప్రామాణిక ఉన్నత విద్య అందుకోగలుగుతున్నారు. అలాగే అంబేద్కర్ స్ఫూర్తితో కొత్త సచివాలయానికి అంబేద్కర్ సచివాలయం అని పేరు పెట్టడం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పడం, అంబేద్కర్ స్ఫూర్తిని, ఉత్తేజాన్ని విశ్వవ్యాప్తం చేస్తుంది.

ఇప్పటికైనా చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఉద్యమించి సాధించుకోవాలి. రాజకీయ రంగంలో ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతినిధ్యం కొనసాగుతున్నది. ఈ తాత్వికత అన్ని రంగాల్లోకి విస్తరించాలి. ఉద్యోగ రంగంలో, న్యాయవ్యవస్థలో, సైనిక వ్యవస్థలో, పారిశ్రామిక వ్యవస్థలో, ఆర్థిక రంగంలో అన్ని రంగాల్లో ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా ఐఏఎస్ మొదలుకొని కింది దాకా, సుప్రీంకోర్టు జడ్జి మొదలుకొని కిందిస్థాయి జడ్జి దాకా, సర్వ సైన్యాధ్యక్షుడు మొదలుకొని కిందిస్థాయి సైనికుడు దాకా ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతినిధ్యం ప్రవేశపెట్టి అమలు జరిపినప్పుడే రాజకీయ ప్రజాస్వామ్యం, సామాజిక రంగంలో, ఆర్థిక రంగంలో, సాంస్కృతిక రంగంలో అమలులోకి తెచ్చినట్టు అవుతుంది. ఉదాహరణకు ప్రతి

లోక్‌సభ నియోజకవర్గానికి యేటా నియమించబడుతున్న వెయ్యిమంది ఐఏఎస్ రిక్రూట్‌మెంట్‌లో ప్రతి నియోజకవర్గానికి ఇద్దరు ఐఏఎస్‌లు ఎంపిక అవుతారు. అలాగే అన్ని రంగాలు. వీటిల్లో సామాజిక వర్గాల, జనాభా రిజర్వేషన్లు ప్రాతినిధ్యం కూడా అమలు జరపాలి. అప్పుడే రాజకీయ రంగంలో వచ్చిన ప్రజాస్వామ్యం మిగతా అన్ని రంగాల్లోకి సాధికారికంగా అమలు జరిపినట్టు అవుతుంది. అంబేడ్కర్ కోరుకునేది కూడా ఇతర రంగాల్లో దీన్ని సాధించడం జరగాలని భారత రాజ్యాంగం పై ప్రసంగిస్తూ నొక్కిచెప్పారు. అందువల్ల వాటిని సాకారం చేయడం కోసం, అమలులోకి తెచ్చుకోవడం కోసం ఉద్యమించడం అవసరం. అదే అంబేడ్కర్ అంతిమ లక్ష్యం.

బీసీ కమిషన్ ఛైర్మన్‌గా "బీసీ నోట్‌బుక్ – భారత రాజ్యాంగంలో బీసీల అంశాలు" అనే పుస్తకంలో అనేక విషయాలు పొందుపరిచాను. ఆ పుస్తకం అధ్యయనానికి మరింత తోడ్పడుతుంది. ఈ కీ–నోట్ ప్రసంగం, ఆ పుస్తకం రెండూ కలిసి మరిన్ని అధ్యయనాలు చేయడానికి ఉపకరిస్తాయి. ఈ అవకాశం కల్పించిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ కె. సీతారామారావుగారికి, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిగారికి, తదితరులందరికి కృతజ్ఞతలు.

(సంభాషణలతో పుస్తకాలు, వ్యాసాలు అందుబాటులోకి తేవడంలో సహకరించిన గనుముల జ్ఞానేశ్వర్, జి. రాములు, విద్యాసాగర్, ఐఏఎస్; గంటా మనోహరం, వి.జి.ఆర్. నారగోని, బీసీ మిత్రులు కొండలరావు, ప్రొఫెసర్ కె. మురళీమనోహర్, ప్రొఫెసర్ సింహాద్రి, డా॥ కత్తి పద్మారావు, ఎ. గవర్రాజు, ప్రొఫెసర్ ఇ. వెంకటేశం, సోషల్ థింకర్స్, వాట్సప్ గ్రూపు సభ్యులు, ఇంకా అనేకమందికి ధన్యవాదాలు.)

అనుబంధం

ఓబీసీలకు అంబేద్కర్ కాంట్రిబ్యూషన్‌ను ఈ కింది విధంగా వర్గీకరించి చెప్పవచ్చు.


1. హిందూ బ్రాహ్మణీయ మనుధర్మ వర్ణ కుల వ్యవస్థ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తాత్విక భూమికల నిర్మాణం చేశారు. తద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరిని మానసిక బానిసత్వం నుండి తాత్విక, సామాజిక, సాంస్కృతిక బానిసత్వం నుండి విముక్తం చేశారు. బౌద్ధం ఈ దేశ ప్రజాస్వామ్యానికి మానవీయ విలువలకు గొప్ప పునాది వేసిందని, బౌద్ధ సంస్కృతిని, జీవన విధానాన్ని, బౌద్ధ తాత్వికతను స్వీకరించాలని, సమాజానికి తాను లక్షలాదిమందితో బౌద్ధ స్వీకారం చేసి మార్గం చూపారు.
2. 1946లో శూద్రులెవరు అనే పుస్తకం రాశారు. ఆ పుస్తకాన్ని బుద్ధుడు, కబీర్‌దాస్, మహాత్మా జ్యోతిబా ఫూలేలకు అంకితం ఇచ్చారు. ఆ తర్వాతే 1947లో అస్పృశ్యులెవరు అనే గ్రంథం రాశారు. శూద్రులు భారతీయ ఇతిహాసాల్లో ఎలా ఉన్నతస్థాయినుంచి అట్టడుగు స్థాయికి దిగజార్చబడ్డారో శూద్రులెవరు అనే పుస్తకంలో అనేక కోణాలను చర్చకు తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన వామపక్ష చరిత్రకారులు ఈ ప్రధానమైన గ్రంథాన్ని చూడనట్టు నటించారు. కులం పునాదులను పెకిలించే అంబేద్కర్ రచనలను వేటినీ అగ్రవర్ణాలు, అగ్రకులాలవారు చర్చించడానికి భయపడ్డారు. వదిలివేశారు.
3. ధార్మిక రంగం వర్ణ కుల వ్యవస్థలు, వేదాలు పురాణాలు ఇతిహాసాలు అన్నిటిలోని అమానవీయ సంస్కృతిని, అమానుష విలువలను, ఆర్థిక దోపిడీని, మానసిక బానసత్వాన్ని, ఆధ్యాత్మిక పేరుతో ఎలా శతాబ్దాలుగా ప్రజలను వంశించారో అంబేద్కర్ వివరించారు.
4. జాతీయ ఉద్యమంలో, రాజకీయ రంగంలో కులరహిత, మతరహిత, అత్యున్నత ఉదాత్త భారత జాతీయవాధిగా జీవితమంతా కొనసాగారు.

సమాజానికి తన జీవితమే సందేశంగా నిలిచారు. సంఘర్షించకుండా ఏదీ అందదు అని బోధించు. సమీకరించు. పోరాడు అని నినాదం ఇచ్చారు.

5. రాజ్యాంగ రూపకల్పనలో 14, 15, 16, 32, 340 ఆర్టికల్స్ చేర్చి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు భవిష్యత్తులో సాధించుకోవాల్సిన హక్కులను, రాజ్యాధికారానికి పునాదులు వేశారు. రాజ్యాంగ భద్రత కల్పించారు.
6. కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు చేశారు.
7. విద్యా రంగం అభివృద్ధి కోసం బ్రిటీషు పరిపాలనా కాలం నుండి అనేక సూచనలు చేసి అమల్లోకి తెచ్చారు.
8. నీటి పారుదల ప్రాజెక్టుల గురించి, విద్యుత్ ప్రాజెక్టుల గురించి అనేక నిర్ధిష్ట ప్రతిపాదన చేశారు.
9. విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టడానికి కృషి చేశారు.
10. బుద్దుడు, కబీర్, గురు రవిదాస్, మహాత్మా జ్యోతిరావు ఫూలే, సాహు మహరాజ్, శాయాజీ గైక్వాడ్‌ల వారసత్వాన్ని కొనసాగించారు.
11. కాకా కాలేల్కర్ కమిషన్ నియామకంలో అంబేద్కర్ పరోక్ష ప్రభావం ఉంది. బీసీ, ఎస్సీలు కలిసి రాజ్యాధికారం సాధించుకోవాలని, పోటీ చేయాలని పిలుపునిచ్చినప్పుడు జరగబోయే పరిణామాలకు భయపడి బీసీలను పక్కదారి పట్టించడానికి కాకా కాలేల్కర్ కమిషన్ వేసి చివరికి ఆ నివేదిక పనికిరాదని కాకా కాలేల్కర్ చేతనే అనిపించి దాన్ని చర్చలోకి రాకుండా చేశారు నెహ్రూ.
12. కాంగ్రెస్ గాంధీ, నెహ్రూ, వల్లభాయ్ పటేల్ నిరంతరం ఓబీసీలను మభ్యపెడుతూ వంశిస్తూ అంబేడ్కర్‌కు సన్నిహితం కాకుండా తమ ప్రభావంలో ఉంచుకుంటూ చరిత్రలో పరిష్కరించలేనంత అన్యాయాలకు గురి చేశారు. ఎప్పటికప్పుడు బీసీలు అంబేడ్కర్‌కు దగ్గర కాకుండా, మనమంతా హిందువులము అనుకుంటూ కులాధిక్యత మిథ్యాభావాన్ని రెచ్చగొట్టారు.

13. ఓబీసీ నాయకులు ఆ కాలంలో ఏం చేశారు. ఏ స్థాయిలో ఉన్నారు అనే అంశాలు ఇప్పటికీ చీకట్లోనే ఉండిపోతున్నాయి. వాటిని ఓబీసీలు వెలికితీసి తమ చరిత్ర నిర్మాణాన్ని స్వయంగా చేపట్టడం అవసరం.

పరిచయం



బి.ఎస్. రాములు
తెలంగాణ రాష్ట్ర
బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్.

బి.ఎస్. రాములు సామాజిక తత్వవేత్త. సుప్రసిద్ధ రచయిత. 175కి పైగా కథలు, నవలలు రాశారు. జననం ఆగస్టు 23, 1949, జగిత్యాల. అనేక సామాజిక, సాహిత్య ఉద్యమాల్లో కార్యశీలి. 1992లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు. తాత్విక రంగంలో విశేష కృషి బౌద్ధం, మార్క్సిజం, అంబేద్కరిజం, మానవతా వాదం, స్త్రీవాదం, బహుజన వాదం, తెలంగాణవాదం, సమన్వయం, సంశ్లేషణ వీరి దృక్పథం. సామాజిక సాహిత్య, తాత్విక రంగాలలో నిరంతర కృషీవలుడు. 250కు పైగా గ్రంథాలకు పీఠికలు... 96 విభిన్న ప్రక్రియల్లో పుస్తకాలు...

వందలాది సాహిత్య, సామాజిక వ్యాసాల ద్వారా వీరు సుపరిచితులు. 'గతితర్క తత్వదర్శన భూమిక', 'అంబేద్కరిజం సోషలిజం', గతితర్కం అంబేద్కరిజం మార్క్సి జం', 'బహుజనతత్వం', 'సమగ్ర వ్యక్తిత్వ వికాసం', 'జీవితం అంటే ఏమిటి', 'సామాజిక న్యాయం', 'తెలంగాణ కథకులు కథన రీతులు', 'లీడర్‌షిప్', 'భారతీయచరిత్ర శూద్ర దృక్పథం', 'బీసీలు ఏం చేయాలి?' మొ॥వి వీరి తాత్విక గ్రంథాలు.

1982లో 'బతుకుపోరు' నవల, 1991లో 'పాలు', 1997లో 'స్మృతి', 2000లో 'మమతలు – మానవ సంబంధాలు', 2003లో 'వేపచెట్టు', 'మమతలు మానవ సంబంధాలు' సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం వారి పురస్కారంతోపాటు అనేక అవార్డులు అందుకున్నారు. 'పాలు' కథల సంపుటి ఆంధ్ర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పాఠ్యాంశం. 'గెలుచుకున్న జీవితం', 'చికాగోలో నానమ్మ', 'ఇల్లు వాకిలి', 'కాలం తెచ్చిన మార్పు' 'పాలు ఇతర కథలు', 'తేనెటీగలు', 'అడవిలోవెన్నెల', 'స్వేచ్ఛనుండి విముక్తి' మొదలైన కథా సంపుటాలు. అనేక కథా సంకలనాల్లో వీరి కథలు చేరాయి. 'చూపు', 'జీవనయానం' వీరి తాజా నవలలు. తెలంగాణ రాష్ట్ర సాధనలో 42 పుస్తకాలు ప్రచురణ. తెలంగాణతల్లి రూపకర్త.

1998లో వెలువడిన 'కథలబడి – కథాసాహిత్య అలంకారశాస్త్రం' గ్రంథం 2011లో ఎమెస్కో ప్రచురణగా వెలువడిన 'కథా రచనకు కథకుడి పాఠాలు' గ్రంథం వందలాది యువ రచయితలకు మార్గదర్శకం... సాహిత్య, సామాజిక, సైద్ధాంతిక రంగాలలో విశేషకృషి చేసిన తనదైన ముద్ర వీరిది. ఎన్నో కథావర్క్‌షాపులను నిర్వహిం చడం... తన పేరిట 'విశాల సాహితి కథా పురస్కారా'లను 1998 నుండి సుప్రసిద్ధులతో పాటు, యువ కథకులకు అందించి సత్కరించడం... యువకథకులను తీర్చిదిద్దడం ద్వారా కథా సాహిత్యానికి తనవంతు సేవలను అందిస్తున్నారు. 2 జూన్ 2014 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం. అక్టోబర్ 2016 నుండి తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ ఛైర్మన్‌గా విధులు నిర్వర్తించారు.

Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

